ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

ఖమ్మం

KHAMMAM

శనివారం, 24 ఫిబ్రవరి 2024

5





శుక్రవారం ఉష్ణోగ్రత	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం :	32	24
భద్రాద్రి కొత్తగూడెం :	36	25

ఆదివాసీ ఓట్లపై

'కమలం' గురి

- రేపు భద్రాద్రికి రానున్న ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్
- విజయ్‌సంకల్ప యాత్రకు శ్రీకారం
- కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ మీదుగా వరంగల్‌లో మార్చి 2న ముగింపు
- రానున్న పార్లమెంటు ఎన్నికలకు కసరత్తు



భద్రాచలం, ఫిబ్రవరి 23: అయోధ్యలో రామాలయ నిర్మాణంతో ఉత్సాహంలో ఉన్న కాషాయ దళం రాబోయే ఎన్నికల్లో సత్తా చాటేందుకు భద్రాద్రి కేంద్రంగా పావులు కదుపుతోంది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి రంగంలో ఉండనుండటంతో ఎలాగైనా ఎంపీ సీటును దక్కించుకునేందుకు ఆ పార్టీ నాయకులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాద్రి రామక్షేత్రంలో తీర్థయాత్రల పునర్జీవనం, ఆధ్యాత్మిక వారసత్వ వృద్ధి (ప్రసాద్) పథకం ద్వారా రూ.41కోట్లతో అభివృద్ధి పనులను చేపడుతున్నారు. 2022 డిసెంబరు 28న రాష్ట్రపతి ద్రౌపది ముర్మునీ ఈ పనులకు శంకుస్థాపన సైతం చేశారు.

అలాగే భద్రాచలం, పినపాక అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో బీజేపీ తన క్యాడర్ ద్వారా విస్తృతంగా కార్యక్రమాలను చేపట్టింది. దీని ద్వారా ప్రజల్లోకి ముఖ్యంగా గిరిజనులను ఆకట్టుకునేందుకు వీలుంటుందని ఆ పార్టీ నాయకులు విశ్వసిస్తున్నారు. ఇందులో భాగంగానే తరచూ బీజేపీ భద్రాచలం కేంద్రంగా తమ కీలక భేటీలను సైతం నిర్వహిస్తోంది. 2017 జనవరి 21న బీజేపీ రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశాలు రెండు రోజులపాటు నిర్వహించగా నాటి కేంద్ర మంత్రులు హన్స్‌రాజ్, బండారు దత్తాత్రేయలతోపాటు రాష్ట్ర జాతీయ నేతలు పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా సమావేశాలు సైతం పలుమార్లు భద్రాద్రి వేదికగా నిర్వహించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ రాక

బీజేపీ కేంద్ర నాయకత్వం పిలుపు మేరకు ఆదివారం నుంచి మొదలు కానున్న బీజేపీ విజయసంకల్ప యాత్రలో ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి పాల్గొననున్నారు. గతంలో 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో సైతం అప్పటి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్‌ను ప్రచారానికి తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో మరోసారి సరిహద్దు రాష్ట్ర సీఎంను తీసుకొచ్చి పినపాక, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పార్టీ శ్రేణుల్లో జవసత్వాలు నింపడంతోపాటు ప్రజలకు చేరువయ్యేందుకు ఇది ఎంతగానో ఉపకరిస్తుందని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. అయోధ్య జోష్‌లో ఉన్న కాషాయ దళానికి విజయ్‌సంకల్ప యాత్రతో మరింతగా ఏజెన్సీ గ్రామాల్లోకి దూసుకెళ్లాలని భావిస్తోంది. విజయ్‌సంకల్ప యాత్ర ఈ నెల 25న భద్రాచలంలో మొదలై కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ మీదుగా సాగి మార్చి 2న వరంగల్‌లో ముగియనుంది. మొత్తం 22 అసెంబ్లీ నియోజకవర్గాలను కవర్ చేస్తూ యాత్ర కొనసాగనుంది.

పర్యటన ఇలా...

భద్రాచలానికి ఆదివారం ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్ రానున్నారు. రాయ్‌పూర్‌లో ఉదయం 10 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 11.30 గంటలకు బూర్గంపాడు మండలంలోని బీపీఎల్ గ్రౌండ్‌లోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడినుంచి కారులో 11.50గంటలకు బయలుదేరి భద్రాద్రి రామాలయానికి చేరుకొని శ్రీసీతారామచంద్ర స్వామి వారి దర్శనం చేసుకుంటారు. 12.40కి రామాలయం నుంచి బయలుదేరి 12.55కి భద్రాచలం మార్కెట్ కమిటీ మైదానానికి వస్తారు. అక్కడ ఒంటిగంటకు విజయ్‌సంకల్ప యాత్రను ప్రారంభించి ప్రసంగిస్తారు. 2.05 గంటల నుంచి 2.45 వరకు భోజన విరామం అనంతరం 3.10కి హెలికాప్టర్ ద్వారా ఛత్తీస్‌గడ్‌లోని రాయ్‌పూర్‌కు తిరిగి వెళ్తారు. ఈ క్రమంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను భద్రాచలం ఏఎస్‌పీ పరితోష్ పంకజ్, సీఐ రాయల వెంకటేశ్వర్లు బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు.

- ఖమ్మం జిల్లా వ్యాప్తంగా చురుగ్గా జాతీయ రహదారుల నిర్మాణాలు
- ఇప్పటికే పూర్తయిన సూర్యాపేట-ఖమ్మం రహదారి
- వేగంగా ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు
- చివరి దశకు ఖమ్మం-కోదాడ పనులు
- త్వరలోనేనాగపూర్-అమరావతి పనులు
- మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవతో రవాణా రంగానికి కొత్త కళ



మన దారి జాతీయ రహదారి



జాతీయ రహదారులు ఉమ్మడి ఖమ్మం జిల్లా రవాణా రంగానికి మణిహారాలుగా మారబోతున్నాయి. పలుచోట్ల రహదారుల పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఖమ్మం-దేవరపల్లి రహదారి పనులు చురుగ్గా సాగుతుండగా, కోదాడ-ఖమ్మం జాతీయ రహదారి పనులు వచ్చే నెలాఖరుతో పూర్తి కానున్నాయి. నాగపూర్-అమరావతి ఖమ్మం జిల్లా పనులకు మరో వారం పది రోజుల్లో శ్రీకారం చుట్టబోతున్నారు. గత డిసెంబరులో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తుమ్మల నాగేశ్వరరావు తీసుకున్న చొరవతో నాగపూర్-అమరావతి పనులతోపాటు జిల్లాకు సంబంధించిన ఇతర జాతీయ రహదారుల పనుల విషయంలో ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. ఖమ్మం-కురవి రహదారికి సంబంధించి పనులు ప్రారంభం కాగా, విజయవాడ-జగదల్‌పూర్‌కు సంబంధించి ఏడేళ్లుగా నత్తనడకన జరుగుతున్న గోదావరి వారధి పనులు కూడా వేగవంతం అయ్యాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

7

ప్రత్యేక శ్రద్ధతో మంజూరు చేయించా...

తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి



ఒకప్పుడు ఒక సెంటీమీటరు రహదారిలేని ఖమ్మం జిల్లాలో ఇప్పుడు జిల్లా అంతటా జాతీయ రహదారులు విస్తరిస్తున్నాయి. అటు ఉమ్మడి రాష్ట్రంలోనూ ఆ తర్వాత ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో రోడ్లు భవనాలశాఖ మంత్రిగా కేంద్ర ఉపరితల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడి ఈ జాతీయ రహదారులన్నీ మంజూరు చేయించా. నాకు అధికారం లేనప్పుడు కూడా జిల్లాలో జాతీయ రహదారులన్నీ పనులు పూర్తి కావాలని, డిల్లీలోని నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి పనుల్లో జాప్యం లేకుండా చూశా. గత ఐదేళ్లుగా నేను మంత్రిగా లేకపోవడంతో జిల్లాలో జాతీయ రహదారుల పనులు కొంత నత్తనడకన నడిచాయి. మళ్లీ నేను మంత్రిగా ఈ పనులన్నింటినీ సకాలంలో పూర్తిచేసేందుకు చొరవ తీసుకుంటున్నా. గతంలో విజయవాడ-జగదల్‌పూర్ నేషనల్ హైవే పూర్తిచేయించా. ఖమ్మం-సూర్యాపేట, ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ మంజూరు చేయించి పనులు ప్రారంభించడం జరిగింది. నాగపూర్-అమరావతికి పనులు కూడా త్వరలోనే ప్రారంభం అవుతున్నాయి. ఖమ్మం-కోదాడ పూర్తవుతుంది. ఖమ్మం-కురవి పనులు ప్రారంభమవుతున్నాయి. అలాగే జిల్లాలో మరికొన్ని జాతీయ రహదారులకు ప్రతిపాదనలు సిద్ధంచేసి కేంద్రానికి ప్రతిపాదనలు పంపించా. ఇవన్నీ పూర్తయితే ఉమ్మడి ఖమ్మంజిల్లా రవాణా రంగానికి నిలయంగా మారనుంది.

ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రిలో దీప్‌చంద్ డయాలసిస్ సెంటర్ డయాలసిస్ నిర్వహణ తీరుపై రాష్ట్ర ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో విశాలాక్షి సీరియస్ అయ్యారు. జిల్లా ఆస్పత్రి డయాలసిస్ కేంద్రం నిర్వహణ తీరుపై 'డైయాలసిస్' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' జిల్లా అనుబంధంలో ప్రచురితమైన కథనానికి జిల్లా, ఉన్నతాధికారులు స్పందించారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థ సమన్వయంతో నిర్వహిస్తున్న డయాలసిస్ కేంద్రంలో మరణాలపై విశాలాక్షి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ మేరకు జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయ అధికారి విచారణ నిర్వహించి మరణాలపై తక్షణమే నివేదికలను అందించాలని ఆదేశించారు. దీంతో ఆరోగ్యశ్రీ సమన్వయ అధికారి డాక్టర్ వేణుమాధవ్ తదితరులు మరణాలపై నివేదికలను సాయంత్రానికి హైదరాబాద్‌కు పంపించినట్లు తెలిసింది.

- ఖమ్మం కలెక్టరేట్

7

- ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో ఆదేశంతో జిల్లా ఆస్పత్రిలో గంటన్నరపాటు విచారణ
- రోగులతో మాట్లాడి వివరాల సేకరణ
- సిబ్బంది పనితీరు, రిజిస్టర్ల నిర్వహణపై అసంతృప్తి
- సత్వరమే నివేదికలు ఇవ్వాలని ఆదేశాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

'డైయాలసిస్'పై

ఇన్‌చార్జి కలెక్టర్ సీరియస్



డయాలసిస్ కేంద్రంలో వార్డులో పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ సత్యప్రసాద్

ఇంటర్ పరీక్షలు

పకడ్బందీగా నిర్వహించాలి

- పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి
- నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలి
- డీఐఈవో రవిబాబు



మాట్లాడుతున్న డీఐఈవో రవిబాబు

ఖమ్మం ఖానాపురం హవేలి, ఫిబ్రవరి 23: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి కె.రవిబాబు, చీఫ్ సూపరింటెండెంట్లు, హైపవర్ కమిటీ సభ్యులకు సూచించారు. ఈనెల 28 నుంచి మార్చి 19వరకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న ప్రథమ, ద్వితీయ పరీక్షల నిర్వహణపై శుక్రవారం నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులకు దిశానిర్దేశం చేశారు.

విధులు కేటాయించిన అధికారులు వెంటనే ఆయా పరీక్షా కేంద్రాలను సందర్శించి ఫర్నిచర్, విద్యుత్, మంచినీరు, వెలుతురు వంటి మౌలిక సదుపాయాలను పరిశీలించి ఏమైనా లోటుపాట్లు ఉంటే తగు చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టీసీ బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవడంతోపాటు పరీక్షా కేంద్రాలవద్ద ప్రథమ చికిత్స ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లాలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 36,578మంది పరీక్షలకు హాజరుకానున్నారని, ఇందుకోసం 70 కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. సీసీ కెమెరా నిఘాలో పరీక్షలు కొనసాగుతాయని, ఎటువంటి మాల్ ప్రాక్టీస్, దుర్వినియోగాలకు తావులేకుండా పరీక్షలు సజావుగా నిర్వహించాలన్నారు.

విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా చూడాలని, ఉదయం 9 గంటల తరువాత పరీక్షా కేంద్రానికి అనుమతించరాదని స్పష్టం చేశారు. స్మార్ట్ ఫోన్లు, మొబైల్స్ స్మార్ట్ వాచీలు తదితర ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ పరీక్షా కేంద్రాలలో అనుమతించబడవన్నారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తాయన్నారు. జవాబుపత్రాలను క్లోస్డ్ కంటైనెర్‌లో తరలించేలా చూడాలని తపాలా శాఖకు సూచించారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని, 144సెక్షన్ అమలు చేయాలని, రెవెన్యూ, పోలీస్ అధికారులను సూచించారు. ఈ సమావేశంలో శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, సింహాచలం, వీరభద్రం పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ స్కూల్‌కు

స్థల పరిశీలన

చింతకాని, ఫిబ్రవరి 23: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 'ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ ఇంటర్నేషనల్ స్కూల్ కోసం చింతకాని మండల పరిధిలోని లచ్చగూడెంలో శుక్రవారం సర్వే నిర్వహించారు. స్కూల్ భవననిర్మాణం కోసం గ్రామంలోని ఇండోర్ స్టేడియం సమీపంలోని స్థలాన్ని పరిశీలించారు. ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ఈఈ నాగేషు స్థలాన్ని పరిశీలించి సిబ్బందికి తగిన ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పూర్ణయ్య, తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో రామయ్య, డీఈ వైకుంఠచారి, నాయకులు అంబటి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొప్పుల గోవిందరావు, ఏఈ గంగాప్రసాద్, గిర్దావర్ ఉష, సర్వేయర్ వెంకయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నందిత

దుర్మరణం విచారకరం

మంత్రి తుమ్మల సహా పలువురి సంతాపం

ఖమ్మం కార్పొరేషన్, ఫిబ్రవరి 23: కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతిపట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. నందిత తండ్రి సాయన్న కంటోన్మెంట్‌లో సుదీర్ఘకాలం ఎమ్మెల్యేగా సేవలందించారని, ఆయన గతేడాది ఫిబ్రవరిలో మృతి చెందగా, ఆ విషాదం నుంచి కోలుకోకుండానే నందిత దుర్మరణం చెందడం బాధాకరమని పేర్కొన్నారు. తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ కంటోన్మెంట్ ప్రజల మన్ననలు పొందుతున్న నందిత ఆకస్మిక మరణం తననెంతో ఆవేదనకు గురిచేసిందని తుమ్మల పేర్కొన్నారు. ఎమ్మెల్యే లాస్యనందిత మృతిపట్ల బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, జిల్లా పరిషత్‌చైర్మన్ లింగాల కమల్‌రాజ్ తీవ్ర సంతాపం తెలియచేశారు. పిన్నవయస్సులో ఎమ్మెల్యేగా గెలిచి రాజకీయంగా ఎదుగుతున్న నందితను రోడ్డు ప్రమాదరూపంలో మృత్యువు కబళించటం దురదృష్టకరమని పేర్కొన్నారు.

- సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించిన విద్యుత్‌శాఖ
- 15రోజుల్లో అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- రోజుకు 78లక్షల 20వేల యూనిట్లు విద్యుత్ వినియోగం
- 'నో పవర్ కట్' అమలులో అధికారుల తలమునకలు



విద్యుత్ ఉపకేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ సురేందర్, సాంకేతిక అధికారులు

విద్యుత్ ఫిర్యాదులకు కంట్రోల్ రూమ్

వ్యవసాయ, గృహ వినియోగదారులు విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటే వాటిని తక్షణం పరిష్కరించేందుకు జిల్లాస్థాయిలో విద్యుత్ ఫిర్యాదుల కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. విద్యుత్ సమస్యలు ఏర్పడితే 9440811525 నెంబర్‌కు ఫోన్ చేయాలని ఖమ్మం టీఎస్ ఎన్పీడీసీఎల్, పర్యవేక్షక ఇంజనీర్ సురేందర్ తెలిపారు.

కరెంటు కోతలకు చెక్

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 23: ఎండా కాలం వస్తోందంటే ఒక వైపు ఉక్కపోతతోపాటు మరోవైపు ఎప్పుడు పోతుందో తెలియని కరెంట్ కష్టాలు ఆందోళన కలిగిస్తాయి. రాత్రి అయితే చాలు అధిక విద్యుత్ వాడకం లోడుతో ట్రాన్స్‌ఫార్మర్లు పేలి పోతుంటాయి. అయితే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధనశాఖ మంత్రి భట్టి విక్రమార్క రాష్ట్రంలోని విద్యుత్‌శాఖ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించి ఒక్క నిమిషం కూడా విద్యుత్ కోతలు ఉండవద్దని ఆదేశించటంతో 'నో పవర్ కట్' నినాదంతో ఖమ్మం జిల్లాలోని విద్యుత్‌శాఖ అధికారులు సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించారు.

78లక్షల 20వేల యూనిట్లు

ఖమ్మంజిల్లాలో 125 విద్యుత్ ఉపకేంద్రాల ద్వారా విద్యుత్ వినియోగదారులకు పవర్ సప్లయి జరుగుతోంది. 33కేవీ ఫీడర్‌లు 55, 11కేవీ ఫీడర్‌లు 544 ఉన్నాయి.వీటి ద్వారా విద్యుత్ హెచ్చుతగ్గులు లేకుండా సక్రమంగా విద్యుత్ పంపిణీ జరుగుతుంది. వారం రోజులుగా ఉష్ణోగ్రతల్లో మార్పులు వచ్చి ఎండ తీవ్రత పెరగటంతో విద్యుత్ వాడకం పెరిగింది.సాధారణ రోజుల్లో రోజుకు 50 లక్షల యూనిట్ల విద్యుత్ వినియోగం కాగా, గురువారం ఒక్క రోజే 78లక్షల 20వేల యూనిట్లు విద్యుత్ వినియోగం జరిగింది. పక్షం రోజుల కాలంలో 368మెగా యూనిట్లు విద్యుత్ వినియోగం నమోదైంది.

కరెంటు కోతలు లేకుండా చర్యలు

సురేందర్, ఎస్ఈ, ఎన్పీడీసీఎల్



నో పవర్ కట్ నినాదంతో జిల్లాలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించాం. డిమాండ్‌కు మించిన విద్యుత్ నిల్వల సామర్థ్యం ఉంచుకోగలం. అలాగే అధిక విద్యుత్ లోడింగ్ ఉన్న విద్యుత్ ఉపకేంద్రాలు, వీధుల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఆయా ప్రాంతాల్లో అదనంగా ఏర్పాటు చేయాల్సిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పది రోజుల్లోపే ఏర్పాటు చేస్తాం. విద్యుత్ కోతలు లేకుండా నిర్వహణపై క్షేత్రస్థాయిలో సిబ్బందికి శిక్షణ ఇచ్చాం.

అధిక లోడ్ ప్రాంతాలపై యాక్షన్ ప్లాన్

సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా వారం రోజులుగా విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ ఉపకేంద్రాల వారీగా అధిక లోడింగ్ విద్యుత్ ఉపకేంద్రాలు, ట్రాన్స్ ఫార్మర్లను గుర్తించారు.విద్యుత్ ఉపకేంద్రాల్లో అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లు, అధికలోడ్ ఉన్న ప్రాంతాల్లో నూతన 11కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసేందుకు యాక్షన్ ప్లాన్ రూపొందించారు. మరో పదిరోజుల్లో అధిక విద్యుత్ లోడింగ్ ఉన్న ప్రాంతాల్లో నూతన ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేయనున్నారు.

నో పవర్ కట్ నినాదంతో..

నో పవర్ కట్ నినాదంతో జిల్లా విద్యుత్‌శాఖ అధికారులు సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించారు. రెండు రోజులుగా విద్యుత్ కేంద్రాల వారీగా ఎస్ఈ సురేంద్ర ఆధ్వర్యంలో డీఈలు, ఏడీఈలు క్షేత్రస్థాయిలో పనిచేసే జేఎల్‌ఎంలు, లైన్‌మ్యాన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లతో సమావేశాలు నిర్వహించి, విద్యుత్ కోతలు లేకుండా ఎలా నిర్వహణ చేయాలో శిక్షణ ఇస్తున్నారు. పైస్థాయి అధికారులకు సమాచారం లేకుండా ఎక్కడైనా కరెంట్ కోతలు విధిస్తే శాఖాపరంగా తీసుకొనే చర్యలను వివరిస్తున్నారు.

పంట కాలువలోకి ఆటో పల్టీ

పది మంది కూలీలకు తీవ్రగాయాలు 6

అంగన్‌వాడీల్లో అప్‌గ్రేడ్ దందా

మినీ కేంద్రాల టీచర్ల నుంచి రూ.లక్షల వసూలు 7


తల్లుల ప్రసాదం కోసం ఎగబడుతున్న భక్తులు


తల్లుల దర్శనం కోసం క్యూలైన్లలో బారులుదీరిన భక్తులు


తిరుగు ప్రయాణం కోసం ఆర్టీసీ క్యూలైన్లలో జనం


తిరుగుపయనమైన భక్తులతో ఆర్టీసీ బస్టాండ్ క్యూలైన్లు, భక్తులను తరలించేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు


మొక్కులు సమర్పించేందుకు వచ్చిన భక్తులతో కిక్కిరిసి పోయిన గద్దెల ప్రాంగణం

భక్త జన హోరు..

▸▸ వనదేవతల రాకతో పోటెత్తిన భక్తులు ▸▸ నిరంతరాయంగా దర్శనాలు ▸▸ మొక్కులు చెల్లించుకున్న సీఎం, గవర్నర్





మేడారం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరలో మూడోరోజు శుక్రవారం కూడా భక్తులు జోరుగా మొక్కులు సమర్పించుకున్నారు. తల్లుల దర్శనాలు నిరంతరాయంగా కొనసాగుతుండగా తరలివస్తున్న భక్తులతో గద్దెల ప్రాంగణం పోటెత్తుతోంది. క్యూలైన్లన్నీ కిటకిటలాడుతున్నాయి. వీఐపీ ప్రవేశ ద్వారాల వద్ద కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వేచిచూస్తుండడంతో అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి. గురువారం రాత్రి సమ్మక్క గద్దెపైకి చేరుకున్న తర్వాత భక్తులు మొక్కులు చెల్లించుకోవడం మరింత జోరందుకుంది.

ప్రముఖుల తాకిడి

జాతరలో శుక్రవారం వీఐపీల తాకిడి పెరిగింది. ప్రముఖులంతా ఈ రోజే రావడంతో అధికారులపై ఒత్తిడి కనిపించింది. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా, సీఎం రేవంత్ రెడ్డి సమ్మక్కను దర్శించుకొని మొక్కులను సమర్పించుకున్నారు. ఉదయం గవర్నర్‌తోపాటు కేంద్రమంత్రి ప్రత్యేక హెలికాప్టర్‌లో గద్దెల వద్దకు చేరుకున్నారు. ఎత్తుబంగారాన్ని తల్లులకు సమర్పించారు. పసుపు, కుంకుమ, గాజులు చీరెలను సమర్పించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి హెలికాప్టర్‌లో మేడారం చేరుకున్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, దనసరి అనసూయ, శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఎస్ఎస్‌పీ రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు ప్రభుత్వ సీఎం శాంతికుమారి తదితరులతో కలిసి అమ్మవార్లను దర్శించుకున్నారు. అంతకుముందు మంత్రి సీతక్క సీఎంకు స్వాగతం పలకగా అధికారులు ఆలయ మర్యాదలతో గద్దెల వద్దకు తోడ్కొని వెళ్లారు. అలాగే రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు తల్లులను దర్శించుకున్న వారిలో ఉన్నారు.



నేడు వన ప్రవేశం.. ముగియనున్న జాతర

గద్దెలపై కొలువుదీరి భక్తులకు ఆశీస్సులం దిస్తున్న వనదేవతలు శనివారం వనప్రవేశం చేయనున్నారు. దీంతో నాలుగు రోజుల పాటు వైభవంగా జరిగిన సమ్మక్క సారలమ్మ మహాజాతరకు తెరపడనుంది. శనివారం సాయంత్రం సుమారు 5 గంటలకు ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్యతో పాటు మిగతా పూజారులు సమ్మక్క గద్దె వద్దకు చేరుకొని చివరి పూజలు చేసి. తల్లి రూపాన్ని తీసుకొని చిలకలగుట్టపైకి తీసుకువెళ్లి నిజస్థానంలో ఉంచి వెనుదిరుగుతారు.

పంట కాలువలోకి ఆటో పల్టీ

● 10 మంది కూలీలకు తీవ్రగాయాలు


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ షాకీర్

కల్లూరు, తల్లాడ, ఫిబ్రవరి 23: రోడ్డు ప్రమాదంలో 10 మంది కూలీలకు గాయాలైన సంఘటన శుక్రవారం మండల పరిధిలోని పెద్దకోరుకొండి గ్రామ శివారున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామం నుంచి రోజూ ఆటోలో కూలీ పనులకు ఆంధ్రాలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం సత్యాలపాడు గ్రామానికి మొక్కజొన్న తోటలో కూలీ పనులకు వెళ్తుంటారు. శుక్రవారం కుర్నవల్లి నుంచి 10 మంది కూలీలు ఆటోలో కూలీకి బయలుదేరారు. పెద్దకోరుకొండి గ్రామ శివారులో రహదారిపై ముందుగా వెళ్తున్న మోటారు బైక్‌ను ఓవర్ టేక్ చేసే ప్రయత్నంలో ఆటో అదుపు తప్పి పక్కన ఉన్న పంట కాలువలో పడింది. అందులో ఉన్న కూలీలు చీమకుర్తి కృష్ణమ్మ, వెంకయ్య, సోరం ఈశ్వరమ్మ, బండి పద్మ, మల్లారపు ఈశ్వరమ్మ, భద్రమ్మ, సైదమ్మ, రాధమ్మ, ఎదుళ్ల పద్మ, శీలం వెంకటే శ్వరరెడ్డి గాయపడ్డారు. గాయాలపాలైన క్షతగాత్రులందరిని కల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి అనంతరం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షాకీర్ తెలిపారు. కూలీలు గాయపడిన సమాచారం అందుకున్న సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి దయానంద్ ప్రభుత్వ పరంగా మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్యాశాఖ అధికారులను ఆదేశించారు.

స్కూల్ బస్సు, లారీ ఢీ

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి23: ఓ స్కూల్ బస్సును వెనుక నుంచి లారీ ఢీకొట్టిన సంఘటనలో ఓ విద్యార్థికి గాయలైన ఘటన శుక్రవారం ఖమ్మం నగరంలో జరిగింది. నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు స్కూల్ ముగిసిన అనంతరం విద్యార్థులను దింపేందుకు వెళ్తుంది. ఈక్రమంలో నగరంలోని బైపాస్‌రోడ్ టేకులపల్లి బ్రిడ్జికి వద్ద లారీ వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పలువురు విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. పాఠశాల యాజమాన్యం ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నారు.

బూర్గంపాడు: బస్సు, కారు ఎదురెదురుగా ఢీకొన్న ఘటన మోరంపల్లిబంజర గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. బూర్గంపాడు మండల పరిధిలోని మోరంపల్లిబంజర గ్రామ శివారులో ఖమ్మం నుంచి భద్రాచలం వైపునకు వెళ్తున్న కారు, మేడారం నుంచి టేకులపల్లి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి.

రెండు ఎక్స్‌కవేటర్ల సీజ్

పాల్వంచ, ఫిబ్రవరి 23: అక్రమంగా పట్టా పొలం నుంచి మట్టిని తోడుతున్నారనే ఫిర్యాదుతో రెండు ఎక్స్‌కవేటర్లను రెవెన్యూ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. పుల్లాయిగూడెంలోని రైతు తాటి హనుమంతరావు తన పట్టా భూమిలో నుంచి మట్టిని తరలించడానికి అనుమతుల కోసం మైనింగ్ శాఖకు గతంలో దరఖాస్తు చేసుకున్నాడు. ఆ ప్రక్రియ కొనసాగుతుండగానే పట్టాదారు అక్కడ నుంచి మట్టిని రెండు ఎక్స్‌కవేటర్ల సహాయంతో మట్టిని తీస్తుడదంతో విషయం తెలుసుకున్న పాల్వంచ రూరల్ ఆర్ఐ హచ్చా, టౌన్ ఆర్ఐ రవికుమార్‌రెడ్డిలు అక్కడకు చేరుకుని రెండు వాహనాలను సీజ్ చేసి రెవెన్యూ కార్యాలయానికి తరలించారు.

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ

● ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

● ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 100 మంది నిరుద్యోగులకు లబ్ధి

● పోటీ పరీక్షలకు వసతితో కూడిన శిక్షణ



ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 23: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని డిగ్రీ పూర్తి చేసిన ఎస్సీ నిరుద్యోగులకు ఇదో శుభవార్త. బ్యాంకింగ్, ఆర్‌ఆర్‌బీ, ఎస్ఎస్సీతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే అన్ని ఉద్యోగాలకు సాంఘీక సంక్షేమశాఖ నుంచి ఉచిత వసతితో కూడిన విద్యాభ్యాసం అందుబాటులోకి వచ్చింది. 5నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ఖమ్మం సాంఘీక సంక్షేమశాఖ డీడీ కస్తాల సత్యనారాయణ శుక్రవారం ఎస్సీ స్టడీ సర్కిల్ నోటిఫికేషన్ విడుదల చేశారు.

5నెలల ఉచిత శిక్షణ ...

ప్రభుత్వ సాంఘీక సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని సాధారణ రిజర్వేషన్లు పాటిస్తూ ఖమ్మం ఎస్సీ స్టడీ సర్కిల్‌లో నిరుద్యోగులను శిక్షణ కోసం ఎంపిక చేయనున్నారు. మొత్తం 100 మంది విద్యార్థులకు ఎంపిక కానుండగా వారిలో ఎస్సీలకు 75శాతం, ఎస్టీలకు 10శాతం, బీసీలకు 15శాతం సీట్లు కేటాయింపు జరుగుతుంది. వీటిలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు జరుగుతుంది. 5 శాతం దివ్యాంగులకు కేటాయించబతాయి. ఆధార్, కుల, ఆదాయ, పాస్ ఫొటోలు, దివ్యాంగులైతే వైకల్య పత్రాలను చూపించాల్సి ఉంటుంది. ఎస్సీ స్టడి సర్కిల్‌కు ఈనెల 23న నోటిఫికేషన్ విడుదల చేసిన వెంటనే దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నారు. టీఎస్‌స్టడీసర్కిల్.కో.ఇన్‌లో దరఖాస్తులు చేయాల్సి ఉంటుంది. మార్చి 6 వరకు తుది గడువును ప్రకటించారు. మార్చి10న ఖమ్మం జిల్లా కేంద్రంలో అర్హత పరీక్షను నిర్వహించనున్నారు. ఈ శిక్షణ మార్చి 18 నుంచి ఆగస్టు 17 వరకు కొనసాగుతోంది.

96మందికి ప్రభుత్వ ఉద్యోగాలు..



ఇప్పటి వరకు 9 బ్యాచ్‌లకు 826 మంది నిరుద్యోగుల అభ్యర్థులకు సాంఘీక సంక్షేమశాఖ స్టడీ సర్కిల్ ద్వారా శిక్షణ ఇవ్వటం జరిగింది. వారిలో 96 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. పలు ఉన్నతస్థాయి హోదాల్లో ఉన్నారు. పారదర్శకంగా స్టడీ సర్కిల్ శిక్షణ నిర్వహిస్తున్నాం. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు ఉచితంగా పోటీ పరీక్షల పుస్తకాలు ఇవ్వడం జరుగుతుంది.

● కస్తాల సత్యనారాయణ, ఎస్సీ, డీడీ

వేర్వేరు ఘటనలో ఇద్దరు యువకుల దుర్మరణం


చలపతి మృతదేహం

లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి23: వేర్వేరు ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన లక్ష్మీదేవిపల్లి మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కారుకొండ గ్రామానికి చెందిన వినోదర శ్రావణ్(22) గురువారం మండల పరిధిలోని గడ్డిగుట్ట సమ్మక్క, సారలమ్మల జాతరకు తన స్నేహితులతో కలిసి వెళ్లాడు. శ్రావణ్ తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా శుక్రవారం గడ్డిగుట్ట జాతర ప్రాంతంలోని పులిగుండం వాగులో మృతదేహం లభించింది. మృతిపై అనుమానం ఉందని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అదే విధంగా మండల పరిధిలోని తోకబంధాల గ్రామానికి చెందిన చలపతి(20) అనుమాన స్పదస్థితిలో మృతి చెందాడు. మృతదేహం పరిసర ప్రాంతాల్లో మందుబాటిళ్లు, గ్లాసులు పడి ఉన్నాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించా రు. మృతదేహాన్ని కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెట్రోల్ బంక్‌లో నీళ్ల కలకలం

సుజాతనగర్, ఫిబ్రవరి 23: మండల కేంద్రలోని హెచ్పీ బంక్‌లో నీళ్ల కలిపిన పెట్రోల్ పోశారంటూ ఓ వ్యక్తి పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. జూలూరుపాడు మండలం గుండ్లరేవు గ్రామానికి చెందిన బానోత్ జగన్నాథం శుక్రవారం ఉదయం కొత్తగూడెం నుంచి తన గ్రామానికి తన బైక్‌పై సుజాతనగర్ వద్ద గల హెచ్పీ బంక్‌లో పెట్రోల్ పోయించుకున్నాడు. కాగా కొంత దూరం వెళ్లాక బైక్ ఆగిపోవడంతో మెకానిక్‌కు చూపించగా బండిని పరిశీలించి పెట్రోల్‌లో నీళ్ల కలిశాయని తెలిపాడన్నారు. దీంతో ట్యాంక్‌లోని పెట్రోల్ తీసి, వేరే పెట్రోల్ పోయడంతో బైక్ స్టార్లయిందని తెలిపాడు. కాగా ఈ విషయమై బంక్ నిర్వహకులని అడగగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని పేర్కొన్నారు. బంక్ నిర్వహకులపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.


నీళ్లు కలిసిన పెట్రోల్ బాటిళ్లను చూపిస్తున్న బాధితుడు జగన్నాథం

అనారోగ్యంతో ఐద్వా నాయకురాలు పద్మ కన్నుమూత

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 23: అనారోగ్యంతో మండల పరిధిలోని మంగళగూడెం గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు రాయల రామయ్య సతీమణి ఐద్వా నాయకురాలు రాయల పద్మ (65) శుక్రవారం మృతి చెందారు. ఐద్వా రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ పద్మ మృతదేహన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాదినేని రమేష్, సీనియర్ నాయకులు బత్తినేని వెంకటేశ్వర్లు, సిద్దినేని కోటయ్య రామయ్య, పి.సంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

100 గ్రాముల గంజాయి పట్టివేత

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 23: 100 గ్రాముల గంజాయిని పోలీసులు పట్టుకున్న సంఘటన ఖమ్మం రూరల్ మండలం, కోదాడ క్రాస్‌రోడ్డులో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం పట్టణానికి చెందిన జొన్నలగడ్డ ప్రభురామ్, కొప్పు వరుణ్, పోట్ల ఈశ్వర్, సోమారపు నవీన్, ఎనుబరి జాన్‌వెస్లీ కలిసి వరంగల్ క్రాస్ రోడ్డుకి చెందిన శంకర్ వద్ద 100 గ్రాముల గంజాయి కొనుగోలు చేశారు. అట్టి గంజాయిని సేవించేందుకు కోదాడ క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులు వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి గంజా యిని, మూడు ద్విచక్రవాహనాలను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి23: పురుగు మందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం మండలంలో జరిగింది. మండలంలోని సుద్దవాగు తండాకు చెందిన బానోతు కళ్యాణ్(26) ఈనెల 14న ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గిరిధర్‌రెడ్డి తెలిపారు.

గుండెపోటుతో వ్యక్తి ..

కామేపల్లి, ఫిబ్రవరి 23: మేడారం జాతరకు వెళ్లి గుండెపోటుతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని పండితాపురం గ్రా మంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల తెలిపిన వివరాల ప్రకారం.. పండితాపురం గ్రామానికి చెందిన బత్తుల చంద్రయ్య(55) భార్య, కుమార్తెతో కలిసి మేడారం జాతరకు రెండు రోజుల క్రితం కలిసి వెళ్లాడు. శుక్రవారం మేడారంలో అమ్మవారి దర్శనం చేసుకొని వస్తుండగా మార్గమధ్యలో ఛాతి నొప్పి వస్తుందని చెప్పండంతో 108 సహాయంతో ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో గుండెపోటుతో మృతి చెందాడు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 23: మండల పరిధిలోని తల్లంపాడు, ముత్తగూడెం తదితర గ్రామాల్లోని ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో శుక్రవారం వ్యవసాయశాఖ అధికారులు ఏడీఏ విజయచంద్ర తనిఖీలు చేపట్టారు. ఆయన వెంట ఏవో నాగేశ్వరరావు ఉన్నారు.

కోర్టు భవనం పనులను ప్రారంభించాలని వినతి


భట్టీని సన్మానిస్తున్న బార్ ప్రతినిధులు

మధిరటౌన్, ఫిబ్రవరి23: మధిరలో నూతన కోర్టు భవనాలను త్వరగా ప్రారంభించాలని మధిర బార్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డిప్యూటీ సీఎంను వారు కలిసి రూ.24 కోట్లతో రెండు నూతన కోర్టు భవనాలకు నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరగా టెండర్ ప్రక్రియను పూర్తి చేసి, పనులు ప్రారంభించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోజడ్ల పుల్లారావు, కోర్టు బిల్డింగ్ కమిటీ చైర్మన్ కట్టా పూర్ణచందర్ రావు, న్యాయవాదులు నెల్లూరి రవి, వాసిరెడ్డి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మణుగూరులో గుప్త నిధుల కలకలం..?

మణుగూరు, ఫిబ్రవరి 23: మణుగూరులో గుప్త నిధుల కోసం అన్వేషణ ముమ్మరంగా సాగుతోందని... లేదు గుప్త నిధులు దొరికాయని అని శుక్రవారం పలు సోషల్ మీడియా గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్నాయి. అసలు నిధులు ఉన్నాయా, దొరికాయా అన్న విషయాలపై స్పష్టత లేనప్పటికీ, ఈ గుప్త నిధుల తవ్వకాలకు సంబంధించిన బ్యాచ్ కొన్నేళ్లుగా తిరుగుతున్నట్లు తెలుస్తోంది. కాకతీయుల పాలించిన ప్రాంతం ఈ మణుగూరు. పురాతన దేవాలయాలు, కోటలు ఉన్నాయి. ఆ నాటి పెద్దపెద్ద బావులు ఇక్కడ నిదర్శనంగా ఉన్నాయి. అంతే కాకుండా ఈ డివిజన్‌లో కరకగూడెం, పినపాక, అశ్వాపురం, మణుగూరు అంతా అటవీ ప్రాంతం కొండలు, గుట్టలు ఉండడంతో కొన్నేళ్ల క్రితమే గుప్త నిధుల బ్యాచ్ అన్వేషణ పూర్తి చేసినట్లు తెలిసింది. కొంత మంది నిధులు ఉన్నాయని పూజలు చేస్తూ ఈ ప్రాంత గుట్టలు, కొండలను అన్వేసిస్తూనే ఉన్నారు. నాలుగేళ్ల క్రితం అన్నారం, అనంతారం గోదావరి ఒడ్డున గల ప్రాంతాల్లో ముత్యాలమ్మ తల్లి దేవాలయాల సమీపాల్లో గోతులు తవ్వి అన్వేషణలు చేసిన దాఖలాలు ఉన్నాయి. వాటిని బయటకు తీసేందుకు ఓ గ్రూప్ లీడర్ నగదు వసూళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

పురావస్తు శాఖ అధికారులు స్పందించాలి....

నిజంగా మణుగూరు కోటగట్టు ప్రాంతంలో నిధులు ఉన్నాయా, ఉంటే పురావస్తు శాఖ అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. పురాతన దేవాలయం శివాలయం.. కొటగట్టు నాడు రాజులు ఈ ప్రాంతంలో ఎక్కడో ఓ చోట నిధులను దాచి ఉంటారనే వార్తలు గత 50 ఏళ్లుగా వినిపిస్తున్నాయి. కానీ ఎక్కడ కూడా నిధులు దొరికిన స్పష్టత మాత్రం బయటికి రాలేదు. కొందరు పట్టు వదలని విక్రమార్కుల్లా ఇదే పనిగా పెట్టుకుని తిరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో కొందరు పాత్రికేయులు కూడా ఉన్నట్లు వినికిడి. ఏది ఏమైనా మణుగూరు పరిసరాల్లో గుప్త నిధుల కలకలం మాత్రం పోవడం లేదు. ఈ విషయంపై అధికారులు స్పందిస్తే గానీ నిధుల అన్వేషకులకు గానీ, ఆశావహులకు గానీ వారి చేసే ప్రయత్నాలకు చెక్ పడతదని స్థానికులు చెబుతున్నారు.

రుణం ఇప్పిస్తామంటూ మోసం

● బాధితులకు తెలియకుండానే బ్యాంకుల్లో అకౌంట్లు ఓపెన్

● ఖాతాల్లో భారీగా నగదు లావాదేవీలు ● పోలీసులను ఆశ్రయించిన మహిళలు

ఖమ్మం క్రైం, ఫిబ్రవరి 23: వారికి తెలియకుండానే బాంక్‌లలో ఖాతాలు తెరిచారు. వారికి తెలియకుండానే భారీగా నగదు ఖాతాల నుంచి ట్రాన్స్‌ఫర్ చేశారు. బ్యాంక్ అధికారులు రావడంతో బాధితులు ఆశ్చర్యపోయారు. ఇదంతా కొందరి మహిళలకు తెలియకుండానే జరిగిన ఘటన... బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..ఇల్లెందు మండలం ఇందిరానగర్, సంజయ్ నగర్ ప్రాంతానికి చెందిన పలువురు మహిళలను స్వయం సహాయక సంఘానికి చెందిన ఓ లీడర్ ఆమె కుమారుడు కొంతకాలం క్రితం బ్యాంకులో రుణాలు ఇప్పిస్తామని మాయమాటలు చెప్పారు. గతంలో పలువురు మహిళల పేరిట ఇల్లెందు ప్రాంతంలో బ్యాంకులో ఖాతాలు కూడా తెరిచి కొద్ది రోజుల తర్వాత రూ.20 వేలు లోను వచ్చిందని చెప్పి బ్యాంకులో రూ.5000 నగదు డిపాజిట్‌గా ఉండాలని రూ.14వేలు నగదు సదరు మహిళలకు ఇచ్చారు. ప్రతినెల రూ.550లు చెల్లించాలని చెప్పడంతో ఆ మహిళలు ఒక నెల నగదు కూడా చెల్లించారు. ఖమ్మం నగరానికి చెందిన బ్యాంక్ అధికారులు ఇటీవల సదరు మహిళల వద్దకు వెళ్లి తమ అకౌంట్లో భారీగా నగదు లావాదేవీలు జరుగుతున్నాయని వారి వద్దకు వచ్చారు. దీంతో ఆ మహిళలు తమ బ్యాంకు అకౌంట్ ఉన్న విషయం కూడా తమకు తెలియదని మహిళలు బ్యాంకు అధికారులకు వివరించారు. కాగా ఐదుగురు మహిళల బ్యాంకు అకౌంట్లో సుమారు రూ.30 లక్షలు నగదు ఉన్నాయని బ్యాంకు అధికారులు తెలపడంతో అనుమానం వచ్చిన మహిళలు వారు స్వయం సహాయక సంఘం లీడర్‌ను ప్రశ్నించారు. దీంతో వారు పారిపోయినట్లు తెలిసింది. కాగా బ్యాంక్‌లో సదరు మహిళల అకౌంట్లు తెలియకుండా తెరిచి ఫోన్ నెంబర్లు కూడా వేరే నెంబర్లు ఇచ్చారు. ఆ నెంబర్లు స్విచ్ ఆఫ్ రావడంతో అధికారులు మహిళల ఇళ్లకు వచ్చారు. దీంతో విషయం వెలుగులోకి వచ్చింది... కాగా... ఇల్లెందుకు చెందిన షేక్ సల్మా, నజియా, సంధ్య ,ఆఫ్రిన్, సౌజన్య, అను మహిళలు శుక్రవారం ఖమ్మం త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు పోలీస్ అధికారులు విచారణ చేస్తున్నారు.

'అనధికార' వాగ్వాదం

- రామాలయంలో బయటి వ్యక్తుల సేవలు
- వైదిక సిబ్బందిపై ఒకరి దుర్భాషలు

భద్రాచలం, ఫిబ్రవరి 23: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో అనధికారిక వ్యక్తుల సేవలు సమస్యలకు కారణమవుతున్నాయనే విమర్శలు వైదిక పరిపాలన సిబ్బంది నుంచి వ్యక్తమవుతున్నాయి. రాముని చెంత సేవ చేస్తామని వస్తున్న వారిలో పలువురు ప్రధాన ఆలయంలోనే సేవకు ఎక్కువ ప్రాధాన్యమిస్తుంటారు.

ఒక సేవకుడు కొంతకాలంగా ఆలయంలో పలు చోట్ల మామిడి తోరణాలు కడుతూ ఉడతా భక్తిగా సేవ చేస్తున్నారు. అంత వరకు బాగానే ఉన్నా గురువారం రాత్రి ఆ అనధికారిక సేవకుడు, ఆలయంలో వైదిక సిబ్బందితో దుర్భాషలాడుతూ వాగ్వాదానికి దిగాడని సమాచారం. మాటా మాటా అనుకోవడంతో అది తీవ్ర రూపం దాల్చి ఘర్షణకు దారి తీయడం ఆలయవర్గాల్లో చర్చనీయాంశం అయింది. ఆలయ సిబ్బంది సామాజిక మాధ్యమ గ్రూపుల్లో సైతం ఘర్షణకు సంబంధించిన వీడియో ప్రత్యక్షమైంది. కాగా తరచూ సదరు సేవకుడు దురుసుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అయితే తనను వైదిక సిబ్బంది కొట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించడం వీడియోలో కనిపించింది. కాగా ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే పరిపాలన వైదిక సిబ్బందికే పూర్తిస్థాయి బాధ్యతలు ఉండాలని వారు పేర్కొంటున్నారు.

నేడు ఐఏఎల్ జిల్లా మహాసభ

ఖమ్మం లీగల్, ఫిబ్రవరి 23: ఖమ్మం నగరంలోని డీపీఆర్‌సీ భవన్‌లో శనివారం ఉదయం 10-30 గంటలకు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) 9వ జిల్లా మహాసభ నిర్వహిస్తున్నట్లు సీనియర్ న్యాయవాదులు పెమ్మసాని పట్టాభి, షేక్ లతీఫ్ తెలిపారు. హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయాధికారి వసంతపాటిల్, ఐఏఎల్ జాతీయ ప్రధానకార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్, తెలంగాణ బార్‌కౌన్సిల్ సభ్యుడు దుస్సా జనార్ధన్ హాజరయ్యే ఈ సభను జయప్రదం చేయాలని ఐఏఎల్ జిల్లా కన్వీనర్ ఓరుగంటి శేషగిరిరావు ఒక ప్రకటనలో కోరారు.

మన దారి జాతీయ రహదారి



ఖమ్మం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో జరుగుతున్న జాతీయ రహదారుల పనులు పూర్తయితే ఉమ్మడి జిల్లా రెండు తెలుగు రాష్ట్రాల్లో జాతీయ రహదారులకు ప్రధాన నిలయంగా మారనుంది. ఆంధ్రా-తెలంగాణతోపాటు ఉత్తర, దక్షిణాది ప్రాంతాలను అనుసంధానం చేసే ఖమ్మం జిల్లా నేషనల్ హైవే అథారిటీ గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులు, ఇతర రహదారుల పనులు చురుగ్గా సాగుతున్నాయి.

రూ.8 కోట్లతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా జిల్లాలో జరుగుతున్న ఈ పనులన్నీ పూర్తయితే జిల్లా రోడ్డు రవాణా వ్యవస్థ స్వరూపమే మారబోతోంది. ఉత్తర, దక్షిణ ప్రాంతాలకు రెండు తెలుగు రాష్ట్రాలకు ఖమ్మం జాతీయ రహదారుల రాకపోకలకు గుమ్మంగా నిలవనుంది. ఉమ్మడి రాష్ట్రంలో, ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రంలో రోడ్లు భవనాలశాఖ మంత్రిగా ప్రస్తుత వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రతిపాదించిన ఈ రహదారులన్నింటికీ నేషనల్ హైవే అథారిటీ పరిపాలన అనుమతులు మంజూరు చేయడంతో నిధుల కేటాయింపు జరిపింది. దేశంలో ఒకేసారి ఇన్ని వేల కోట్ల రూపాయల నిధుల కేటాయింపు పనులు జరుగుతున్న జిల్లాగా ఖమ్మం జిల్లాకు గుర్తింపు లభించింది.

హైదరాబాద్-రాజమండ్రి-విశాఖకు వేగంగా సాగే సూర్యాపేట-ఖమ్మం నాలుగులైన్ల రహదారుల పనులు ఇప్పటికే పూర్తికాగా, ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే నాలుగు లైన్ల రహదారి పనులు వేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే 36శాతం పనులు పూర్తయ్యాయి. రూ.2300కోట్లతో 103 కి.మీ. పొడవున ఈ నాలుగు లైన్ల రహదారి పనులు జరుగుతున్నాయి వచ్చే అక్టోబరు నాటికి ఈ పనులు పూర్తికానున్నాయి. ఈ రహదారి పూర్తయితే రాజమండ్రి-విశాఖ-హైదరాబాద్ రాకపోకలకు తక్కువ సమయంలోనే ప్రజారవాణాతోపాటు వస్తు రవాణ, పోర్టు రవాణ జరగనుంది. విజయవాడ వెళ్లకుండానే కాకినాడ, రాజమండ్రి, విశాఖతోపాటు ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ఈ రహదారి ప్రయాణ సౌలభ్యం లభించనుంది. దీనికి ఎగ్జిట్స్‌ను కోదాడ-ఖమ్మం రోడ్, వైరా-మధిర రోడ్, విజయవాడ-జగదల్‌పూర్ రోడ్ వద్ద, ఏలూరు-జంగారెడ్డిగూడెం వద్ద, సూర్యాపేట-ఖమ్మం రహదారి వద్ద, కల్లూరు-విజయవాడ వెళ్లే మార్గం, వేంసూరు వద్ద ఏర్పాటు చేయబోతున్నారు.

ఇప్పటికే ఖమ్మం-సూర్యాపేట నాలుగులైన్ల రహదారిని రూ.1876 కోట్లతో 58.6కి.మీ. పూర్తిచేశారు. హైదరాబాదు నుంచి ఖమ్మానికి ప్రయాణ సమయం తగ్గిపోయింది. గతంలో 4 గంటల పైగా సాగే ప్రయాణం ఇప్పుడు రెండున్నర గంటలకే పరిమితమవుతుంది. జిల్లాలో 77 కి.మీ. పొడవునా రూ..2800 కోట్లతో పనులు చేపట్టబోతున్నారు. నాగపూర్ నుంచి బందరు పోర్టుతోపాటు కాకినాడ, విశాఖ, కృష్ణపట్నం పోర్టులకు అనుసంధానం చేసి సరుకు రవాణా వేగవంతం చేసి ప్రయాణ గమ్యాన్ని తగ్గించేందుకు ఈ రహదారి నిర్మాణమవుతోంది.

ఖమ్మం జిల్లాలో 375 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 250 ఎకరాల భూసేకరణ పూర్తయింది. మరో 125 ఎకరాల్లో ఖమ్మం సమీపంలో భూ సేకరణకు చర్యలు తీసుకుంటున్నారు. 2026 నాటికి ఈ రహదారి పనులు పూర్తికావాల్సి ఉంది. వాస్తవానికి నాగపూర్ టు విజయవాడకు ప్రస్తుతం 660 కి.మీ. రహదారి పొడవుండగా కొత్తగా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి వల్ల 420 కి.మీ.కు దూరం తగ్గబోతుంది. ఇప్పటికే ఈ పనులు వరంగల్ జిల్లా పరిధిలో మొదలయ్యాయి.

ఖమ్మం జిల్లాలో అలైన్‌మెంట్ ఖమ్మం నగరం వద్ద సమస్య ఉండగా ఇటీవలే కేంద్ర ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించింది. దీంతో నేషనల్ హైవే అథారిటీ పనులు చేపట్టింది. ఈ రహదారికి ఎగ్జిట్స్‌ను ఖమ్మం -అశ్వారావుపేట రోడ్డులోని ఖమ్మం కలెక్టరేట్ సమీపంలో, కొదుమూరు వద్ద, పొద్దుటూరు వద్ద, వైరా -బోనకల్ రహదారిలో చిన్నబీరవల్లి వద్ద, తిరువూరు-గంపలగూడెం రోడ్డులోని ఆత్కూరు, మధిర-ఎర్రుపాలెం రోడ్డులోని పెగళ్లపాడు, కొత్తపాలెం-గంగినేని రోడ్డులోని రేమిడిచర్ల వద్ద ఏర్పాటు చేయనున్నారు.

చివరి దశకు ఖమ్మం-కోదాడ పనులు

నేషనల్ హైవే అథారిటీ కింద కోదాడ నుంచి ఖమ్మం వరకు రూ.10.39 కోట్లతో 31.8 కి.మీ. పొడవున జరుగుతున్న నాలుగులైన్ల రహదారి పనులు చివరి దశకు చేరాయి. మార్చి నెలాఖరుకల్లా రహదారి పనులు పూర్తిచేసేందుకు నేషనల్ హైవే అథారిటీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఈ రహదారితో ఖమ్మం-దేవరపల్లి, ఖమ్మం-సూర్యాపేట, నాగపూర్-అమరావతి రహదారి, కోదాడ-ఖమ్మం రహదారి కూడా అనసంధానం కాబోతుంది. అన్ని జాతీయ రహదారులను కలుపుతూ ఖమ్మం చుట్టూ వలయాకార రహదారికి కూడా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఇందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే చర్యలు చేపట్టారు.

అంగన్‌వాడీల్లో అప్‌గ్రేడ్ దందా



- మినీ కేంద్రాల టీచర్ల నుంచి రూ.లక్షల వసూలు
- మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న ప్రైవేటు వ్యక్తి
- ఐసీడీఎస్ అధికారులకు వాటాలు పంచుతున్నట్లు ప్రచారం
- చర్యలు తీసుకోవాటంటున్న బాధితులు

కొత్తగూడెం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పినపాక నియోజకవర్గంలోని అంగన్‌వాడీ వ్యవస్థలో అవినీతి అక్రమాలకు అంతులేకుండా పోతోంది. ఇటీవల మినీ అంగన్ వాడీ కేంద్రాలను హోదాను పెంచుతూ ఉత్తర్వులు జారీచేయడంతో ఇంటిదొంగలు దందాకు తెరలేపారు. కేంద్రాలు అప్‌గ్రేడ్ కావాలంటే అక్షరాలా లక్షన్నర ముట్టజెప్పాలని హుకుం జారీచేశారు. ఇందుకు ఓ మధ్యవర్తినికి ఏర్పాటు చేసుకుని కార్యకర్తలనుంచి డబ్బులు దండుకున్నారు. వసూళ్ల కోసం మణుగూరు డివిజన్‌లోని ప్రతీ ఐసీడీఎస్ సర్కిల్ నుంచి ఒక్కో టీచర్‌ను ఎంచుకున్నారు. వారి ద్వారా సర్కిల్‌కు రూ.1,50,000 ముక్కుపిండి మరీ వసూలు చేశారు. అధికారులకు రూ.లక్ష, సూపర్ వైజర్లుకు రూ. 30 వేలు, వసూలు చేసినందుకు రూ. 20వేల చొప్పున డీల్ నడిపించారు. మణుగూరు, కరకగూడెం, పినపాక మండలాల్లో మినీ అంగన్‌వాడీల్లో 50కి పైగా కేంద్రాలు అప్‌గ్రేడ్ అయ్యాయి. మంచి వేతనం, పెరిగే హోదా కావాలంటే డబ్బులు చెల్లించాలనడంతో చాలా మంది అప్పులు చేసి మరీ మధ్యవర్తికి డబ్బులు ఇచ్చారు. ఎక్కడ తమ ఉపాధి పోతుందేమోననే ఆందోళనతో కొందరు టీచర్లు అధిక వడ్డీలకు అప్పులు చేశారు. కొందరు మాత్రం తాము ఒక్క పైసా ఇచ్చేది లేదంటూ సదరు మధ్యవర్తితో వాదనకు కూడా దిగినట్లు సమాచారం.

రేపటి పోస్టుకు ముందస్తు దోపిడీ

రేపో మాపో అంగన్ వాడీపోస్టులు పడతాయి.. ఇంకేముంది.. ఆ పోస్టు మీ సొంతం కావాలంటే తప్పదు.. చెప్పినంత డబ్బులు ఇవ్వండి... ఇక ఆ పోస్టు మీదే.. అంటూ సదరు మధ్యవర్తి మరో దందాకు కూడా పాల్పడినట్లు తెలుస్తోంది. పోస్టులు భర్తీ అవుతాయని భావిస్తున్న కేంద్రాల పరిధిలోని నిరుద్యోగ మహిళలకు మాయమాటలు లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. ఈ విషయంలో కూడా అధికారుల పాత్ర ఉందనే విమర్శలు వస్తున్నాయి. ఉపాధి కోసం నిరుద్యోగ యువతులు అంగన్‌వాడీ టీచర్ పోస్టు కోసం ఆశగా నగదు కూడా కొంత జమ చేసినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా స్త్రీ శిశు శాఖలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై వస్తున్న ఆరోపనలపై అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చేతులు మారిన లక్షల రూపాయలను రికవరీ చేసి బాధిత టీచర్లకు అందించాల్సి ఉంది.

ఆ శాఖలో ఇక్కడ ఆయనే కీలకమా..

మణుగూరు డివిజన్‌లో ఉన్న సదరు ప్రైవేటు వ్యక్తి అధికారులు, సూపర్‌వైజర్లతో సత్ సంబంధాలు కలిగి ఉంటూ చక్రం తిప్పుతున్నాడు. ఎవరిని ఉంచాలి.. ఎప్పుడు ఏ సెంటర్‌నుతనిఖీ చేయాలో కూడా నిర్ణయిస్తున్నట్లు తెలుస్తోంది. తన మాట వినని ఉద్యోగులను ఇబ్బందులు పెట్టడంల ఆయన సిద్ధహస్తుడని బాధితులు చెబుతున్నారు. ప్రతీ నెలా ఠంచనుగా అధికారులకు వాటాలు ముడుతుండటంతో కిమ్మనకుండా ఉంటున్నారని వినికింది. పలు అక్రమాలకు పాల్పడిన వారిని గతంలో పలు ప్రాంతాలకు బదిలీ చేయగా వారిని మరలా ఈ ప్రాంతాలకు రప్పించాడనే వార్తలు వినిపిసున్నాయి. డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలతో ఆటలాడుకుంటున్న ఆ వ్యక్తి వ్యవహారం హద్దులు కూడా దాటుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే మున్ముందు భారీ అక్రమాలకు పాల్పడే అవకాశం ఉంది.

వచ్చే నెల 9న జాతీయ లోక్ అదాలత్

సత్తుపల్లి, ఫిబ్రవరి23: వచ్చేనెల 9వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని 6వ అదనపు జిల్లా న్యాయాధికారి వెంపాటి అపర్ణ కోరారు. శుక్రవారం సత్తుపల్లి కోర్టు ఆవరణలో పోలీస్ అధికారులు, న్యాయవాదులతో ఆమె సమావేశమయ్యారు. అధిక సంఖ్యలో కేసుల పరిష్కారం కోసం పోలీసు అధికారులు కృషి చేయాలని సూచించారు. అనివార్య కారణాలతో వివిధ కేసులలో చిక్కుకుని సతమతమవుతున్న వారికోసం నిర్వహించ తలపెట్టిన జాతీయ లోక్ అదాలత్‌లో రాజీమార్గాన్ని ఎన్నుకోవడం ద్వారా విలువైన సమయం వృథా కాదన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించబడిన కేసులు అంతి తీర్పులు ఉంటాయన్నారు. ఇలాంటి వాటికి అప్పీల్ కూడా ఉండదని చెప్పారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి పీ.అరుణకుమారి, జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్‌కే ఆయేషాషరీన్, అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి లావణ్య, ఏపీవో బోయినపల్లి రవికుమార్, కల్లూరు ఏసీపీ ఏ.రఘు, సీఐ వెంకటేశం, ఎస్‌ఐలు వెంకటేష్, షాకీర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశ అవకాశం

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 23: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ రామాంతపూర్‌లో 2024-25 విద్యా సంవత్సరంలో 1వ తరగతి ప్రవేశాల్లో ఎస్సీ విద్యార్థులకు ప్రవేశ అవకాశం ఉందని డీడీ కస్తాల సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. 1.6.2017 నుంచి 31.5.2018 మధ్య జన్మించిన పిల్లలు అర్హులని తెలిపారు. ఖమ్మం జిల్లాకు రెండు సీట్లు కేటాయించారని వాటిలో రామాంతపూర్ 1, బేగంపేట 1 ఉన్నాయి. స్థానిక ధ్రువీకరణ పత్రం, పుట్టిన తేదీ, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలతో మార్చి 12వ తేదీ సాయంత్రం 5గంటలలోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

'డై'యాలసిస్'పై ఇన్‌చార్జ్ కలెక్టర్ సీరియస్

- ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో ఆదేశంతో జిల్లా ఆస్పత్రిలో గంటన్నరపాటు విచారణ

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 23: జిల్లా ఆస్పత్రి డయాలసిస్ కేంద్రం నిర్వహణ తీరుపై 'డైయాలసిస్' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' జిల్లా అనుబంధంలో ప్రచురితమైన కథనానికి జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ బి.సత్యప్రసాద్ స్పందించారు. శుక్రవారం ఉదయం ఆయన నేరుగా జిల్లా ఆస్పత్రిలో రెండు గంటలపాటు విచారణ నిర్వహించారు. డయాలసిస్ కేంద్రానికి వచ్చిన ఆయన నిర్వాహకులకు ముచ్చెమటలు పట్టించారు. ప్రస్తుతం ఎంతమంది ఉన్నారు. పడకల సామర్థ్యం వివరాలను తెలుసుకున్నారు. ఆ తర్వాత ప్రతి యంత్రం వద్ద ఉన్న డయాలసిస్ రోగులను పరిశీలించారు. డయాలసిస్ సెంటర్ మేనేజర్ క్రాంతికుమార్‌ను రోగులకు ఇప్పటివరకు ఎన్ని సెషన్స్ చేశారు. వారికి ఎన్ని డబ్బులు ఇచ్చారు.. ఇంకా ఎంత పెండింగ్ ఉందని ప్రశ్నించారు. జిల్లా ఆస్పత్రి చెల్లింపుల అధికారి రిజిష్టర్లనూ పరిశీలించారు.

ఇప్పటివరకు చెల్లింపులు, ఇంకా పెండింగ్‌లో ఉన్న వివరాలను సిబ్బందిని అడిగారు. అంతే కాదు రిజిస్టర్లలో ఉన్న రోగుల ఫోన్ నెంబర్ల ఆధారంగా వారికి ఫోన్ చేసి విచారించారు. వారు ఇంకా డబ్బులు రావాలంటూ చెప్పడంతో ఎందుకు పెండింగ్‌లో పెట్టారని ప్రశ్నించారు. రవాణా చార్జీల చెల్లింపుల్లో ఎందుకు జాప్యం చేస్తున్నారని, డయాలసిస్ రోగులకు టీ, స్నాక్స్ ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా నిధులు చెల్లింపులు చేస్తున్నా.. ఆస్పత్రి అధికారులు, దీప్‌చంద్ డయాలసిస్ సంస్థ ప్రతినిధులకు కుదిరిన అగ్రిమెంట్ వివరాలను చూపించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ కోరగా, తమ వద్ద లేవని నిర్వాహకులు తెలిపారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన సాయంత్రం లోగా పూర్తి వివరాలను అందించాలని ఆదేశించారు.

డయాలసిస్‌కు వచ్చిన రోగుల సహాయకులతో కూడా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడారు. నిర్వాహకుల తీరుపై ఇన్‌చార్జ్ కలెక్టర్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. సెంటర్‌లో నెఫ్రాలజీ వైద్యులు లేకపోవడం.. ఆయనకు ఇచ్చే గౌరవ వేతనాన్ని ఎవరికి ఇస్తున్నారనే ప్రశ్నకు కూడా సమాధానం చెప్పకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. దీప్‌చంద్ డయాలసిస్ కేంద్రం సేవలు ఇక్కడ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 55మరణాలు సంభవించినట్లు విచారణలో బహిర్గతమయ్యాయి. దీంతో మృతుల వివరాలను అందించాలని ఆదేశించారు. ఇన్‌చార్జ్ కలెక్టర్‌తోపాటు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, ఆర్ఎంవో డాక్టర్ అమర్‌సింగ్, ఆరోగ్యశ్రీ సమన్వయ అధికారి డాక్టర్ మాధవరావు, మేనేజర్ పి.శ్రీనివాస్, దీప్‌చంద్ డయాలసిస్ కేంద్రం మేనేజర్ క్రాంతికుమార్ తదితరులున్నారు.



ఆసుపత్రి సేవలపై ప్రశ్నిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్

ఎంసీహెచ్‌ను తనిఖీ చేసిన ఇన్‌చార్జ్ కలెక్టర్

జిల్లా ఆస్పత్రికి అనుసంధానంగా ఉన్న మాతా, శిశు సంరక్షణ కేంద్రాన్ని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ బి.సత్యప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. ఎంసీహెచ్‌లో వార్డులను కలియ తిరిగారు. లేబర్‌రూం పడకలను పరిశీలించారు. రోగులకు తగిన విధంగా పడకలు లేకపోవడం పట్ల సూపరింటెండెంట్‌ను అడిగారు. గర్భిణులు, వారికి అందుతున్న సేవలు, క్యూలైన్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఇప్పటివరకు చేస్తున్న స్కానింగ్‌లు, ఇతరత్రా సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత ప్రధాన ఆస్పత్రిలోనూ ఆరోగ్యశ్రీ విభాగం, ఓపీ నమోదు క్యూలైన్లు, వివిధ విభాగాల్లో వైద్యుల పనితీరును పరిశీలించారు.



గద్దెల ప్రాంతంలో కిక్కిరిసిన భక్తులు

వనం నుంచి జనంలోకి..

- గద్దెలపై కొలువు దీరిన సమ్మక్క సారలమ్మ
- మొక్కులు చెల్లించేందుకు బారులు
- బొజ్జాయిగూడెంలో 3వ రోజు భక్తుల తాకిడి

ఇల్లెందురూరల్, ఫిబ్రవరి 23: వనం నుంచి జనంలోకి వచ్చిన వనదేవలైన సమ్మక్క, సారలమ్మలను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెంలో 3వ రోజు భక్తుల తాకిడి ఎక్కువైంది. వనదేవతలైన సమ్మక్క-సారలమ్మలను దర్శించుకొని మొక్కులు, చెల్లించేందుకు పిల్లపాపల కలిసి కుటుంబంతో తరలివచ్చారు. శుక్రవారం జిల్లాలో జాతర సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో భక్తుల తాకిడి ఎక్కువైంది. సమ్మక్క-సారలమ్మలు గద్దెలపై కొలువు దీరడంతో మొక్కులు చెల్లించెందుకు భక్తులు క్యూకట్టారు.

గురువారం రాత్రి గద్దెల ప్రాంతంలో రోడ్డు ప్రమాదం జరిగి ఓ యువకుడు సైతం మృతి చెందాడు. దీంతో ఇల్లెందు పోలీస్ డీఎస్పీ చంద్రబాను, సీఐ కరుణాకర్ ట్రాఫిక్‌ను ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తు వాహనాలను తరలించారు. శనివారం అమ్మవార్ల వన ప్రవేశంతో జాతర ముగిస్తుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

హామీలు.. నీటి మూటలు

- సీఎస్ఆర్‌ను మరిచిన బీటీపీఎస్
- ప్రభావిత గ్రామాల అభివృద్ధిని పట్టించుకోని యాజమాన్యం

మణుగూరు రూరల్, ఫిబ్రవరి 23: మణుగూరు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ప్రభావిత గ్రామాల్లో నాడు జెన్కో ఉన్నతాధికారులు, ప్రభుత్వ ఉన్నాతాధికారులు ఇచ్చిన హామీలు.. నీటి మూటలవుతున్నాయి. మణుగూరు-పినపాక మండలాల సరిహద్దుల్లో నిర్మించిన బీటీపీఎస్ నిర్మాణానికి ముందు జెన్కో యాజమాన్యం, ప్రభుత్వ అధికారులు ఎన్నో హామీలిచ్చారు. ప్రాజెక్ట్ నిర్మాణం చిక్కుడుగుంట, సాంబాయిగూడెం, దమ్మక్కపేట గ్రామాల నడుమ నిర్మిస్తుండడంతో ఇక్కడి ప్రజలు భూములను ఇవ్వడంతోపాటు ప్రాజెక్ట్ నిర్మాణానికి అన్ని రకాలు సహకరించారు.

గ్రామాల అభివృద్ధి మరిచారు..

ప్రాజెక్ట్ నిర్మాణం చేపడితే కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులనుంచి గ్రామాలకు రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో కల్పిస్తామని అధికారులు చెప్పారు. ప్రభావిత గ్రామాల ప్రజలకు ఉచితంగా విద్యుత్‌ను కూడా సరఫరా చేస్తామన్నారు. అయితే ప్రాజెక్ట్ పూర్తయి రెండేళ్లు గడిచినా పూర్తి స్థాయిలో హామీలు అమలు కాలేదు. అక్కడక్కడ సీసీ రోడ్లు వేశారే తప్ప.. అంతకు మించి అభివృద్ధి లేదు. గోదావరి నుంచి ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా శుద్ధజలం అందజేస్తామని చెప్పినా అమలు కాలేదు. చిక్కుడుగుంట, దమ్మక్కపేట ప్రాంత ప్రజలు తీవ్ర తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారు.



డ్రైనేజీ వ్యవస్థ లేక రోడ్లపై నిలిచిన వరద నీరు(ఫైల్)

స్పందించని యాజమాన్యం..

ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల సర్పంచ్‌లు అభివృద్ధి పనుల విషయమై యాజమాన్యాన్ని ప్రశ్నించినా ఫలితం శూన్యం. బీటీపీఎస్ నుంచి వ్యర్థాలు, సాంబాయిగూడెం ప్రాంతంలో నిర్మించిన యాష్‌పాండ్ లనుంచి వచ్చే బూడిద రైతుల పొలాలను ముంచేస్తున్నాయి. దీంతో రైతులు పొలాలు వదిలి కూలీకి వెళుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఈ సమస్యపై దృష్టి సారించి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రబీ బియ్యాన్ని నిర్ణీత సమయంలోగా ఇవ్వాలి

- మిల్లర్లకు అదనపు కలెక్టర్ ఆదేశం

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 23: రబీ 2022-23 సీజన్ ధాన్యానికి సంబంధించిన బియ్యాన్ని ఎఫ్‌సీఐకి నిర్ణీత గడువులోగా అందించాలని జిల్లా అదనపుకలెక్టర్ మధుసూదన్ నాయక్ పౌరసరఫరాల అధికారులు, రైస్ మిల్లర్స్ యజమానులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పౌరసరఫరాల అధికారులు రైస్ మిల్లర్స్ యాజమాన్యంతో పెండింగ్ ధాన్యం సరఫరాపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ 2022-23 సీజన్‌నకు సంబంధించిన ధాన్యం, బియ్యం జిల్లాలోని రైస్‌మిల్లర్లు ఇప్పటివరకు కేవలం 21శాతం బియ్యంను మాత్రమే సరఫరా చేశారని అన్నారు. మిగతా 79శాతం బియ్యాన్ని ఎఫ్‌సీఐకి వేగంగా అందించేందుకు సత్వర చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి మిల్లరు తప్పని సరిగా ప్రతి రోజు వారికి కేటాయించిన ధాన్యాన్ని మర పట్టించి ఎఫ్‌సీఐకి బియ్యం సరఫరా చేయాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

నేడు సహస్ర కలశాభిషేకం

భద్రాచలం, ఫిబ్రవరి 23: భద్రాచలంలోనిశ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మాఘమాసంలో నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం సహస్ర కలశాభిషేకం నిర్వహించనున్నారు.

భద్రాచలంలోని యాగశాలలో గురువారం రాత్రి అర్చకులు అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమయంలో ఎటువంటి విఘ్నాలు కలుగకుండా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం సహస్ర కలశ వాహన నిర్వహించారు. శనివారం సహస్ర కలశాభిషేకం నిర్వహించనున్నారు. పాంచరాత్ర అగమశాస్త్ర ప్రకారం నిర్వహించే ఈ అభిషేకంతో లోకం సుభిక్షంగా ఉండటంతోపాటు ప్రజలు సుఖశాంతులతో తులతూగాలని నిర్వహిస్తారు.

కాగా సహస్ర కలశాభిషేకాన్ని పురస్కరించుకుని శ్రీ సీతారామచంద్రస్వామివారికి ప్రతీ నిత్యం నిర్వహించే నిత్యకల్యాణం, స్వామివారికి పవళింపు సేవలు రెండు రోజులపాటు నిలిపివేసారు. ఈ కార్యక్రమంలో వైదిక సిబ్బంది పాల్గొన్నారు.

వరిపై తెగుళ్ల దాడి..

దిగుబడులు రావని రైతుల ఆవేదన

కరకగూడెం, ఫిబ్రవరి 23: రైతులు కష్టపడి పండించిన పంట తెగుళ్ల బారిన పడుతుండగా రైతుకు నిరాశే మిగులుతోంది. ఎకరాకు 20 నుంచి 23 కాంటాలు అవడంతో రైతన్నలు పెట్టిన పెట్టుబడులు రాలేక పెట్టిన పెట్టుబడులు రాక అప్పుల పాలవుతన్నాడు.

రెండో పంటగా రైతులు యాసంగి పంటను సాగుచేశారు. పంటలపై అగ్గితెగులు, ఆకుముడత, సుడిదోమ, పండాకు, పురుగుతో రైతులు అనేక రకాల మందులను పంటపై పిచికారి చేసినా ఫలితం ఉండటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు పంట చేతికి అందే దశలో పురుగుతో వరి కంకులలో పురుగు తెగులు ఉండటంతో అవి తెల్లకంకులుగా మారుతున్నాయి. దోమ, అగ్గి తెగులుతో పంట కోలుకోవడం లేదు.

15 వేల ఎకరాలలో సాగు

నియోజక వర్గంలో రైతులు యాసంగి పంటగా వరి పంటను సుమారు 15 వేల ఎకరాలు సాగుచేశారు. కరకగూడెం మండలంలో 27, ఎకరాలు, పినపాక మండలంలో 4000, మణుగూరు మండలంలో 2050, అశ్వాపురం మండలంలో 2500, బూర్గంపాడు మండలంలో 3000, గుండాల మండలంలో 200, ఆళ్లపల్లి మండలంలో 200 ఎకరాలలో వరిని సాగుచేశారు.



తగు జాగ్రత్తలు తీసుకోవాలి: ఏవో ఛటర్జి


తెగుళ్ల బారి నుంచి పంటను కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అగ్గితెగులు వచ్చినప్పుడు 0.6 గ్రాముల ట్రైసైక్లాజోల్ లేదా 1 మిల్లీ లీటర్ల ఎడిఫెన్పాస్ రసాయనాన్ని లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి.

పాఠశాల డైరెక్టర్‌పై దాడికి ట్రస్మా ఖండన

ఖమ్మం ఖానాపురంహవేలి, ఫిబ్రవరి 23: ఖమ్మం నగరంలోని క్రియేటివ్ పాఠశాల డైరెక్టర్ కౌశిక్‌పై శుక్రవారం కొందరు వ్యక్తులు దాడి చేయడాన్ని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోషియేషన్ తీవ్రంగా ఖండిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు గుర్రం కాంతారావు తెలిపారు. పాఠశాల యాజమాన్యం తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థికి సంబంధించిన వారు కొందరు వ్యక్తులు పాఠశాల ఆవరణలోకి వచ్చి సామగ్రిని ధ్వంసం చేశారు. డైరెక్టర్, కరస్పాండెంట్లపై దాడి చేశారు. ఫీజు బకాయిల విషయంలో వాయిదాలు ఇచ్చినప్పటికి చెల్లించాల్సిన ఫీజు చెల్లించకుండా గొడవకు దిగి దాడి చేశారని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. పాఠశాల పై జరిగిన దాడి విషయం తెలుసుకున్న అసోషియేషన్ నాయకులు నగరంలోని పాఠశాలకు చేరుకొని వివరాలు సేకరించి ఖమ్మం త్రీటౌన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దాడిని ఖండించిన వారిలో ట్రస్మా రాష్ట్ర కన్వీనర్ ఐవీ రమణారావు, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎండీ మతిన్, శ్రీకాంత్, సూరిబాబు, ఆర్‌వీఎస్ యాదవ్, సీనియర్ కరస్పాండెంట్లు సాంబశివారెడ్డి, వీరన్న, న్యూవిజన్ ప్రసాద్, హార్వెస్ట్ రవి మారుత్, గీతాంజలి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకులు



చేగొమ్మలో భూ అక్రమాలపై విచారణ జరిపించాలి: కాంగ్రెస్

కూసుమంచి, ఫిబ్రవరి 23: మండలంలోని చేగొమ్మ గ్రామంలో భూ అక్రమాలపై విచారణ జరిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కొండపర్తి సురేష్, మాజీ సర్పంచులు బొల్లికొండ శ్రీను, నర్రా సీతారాములు డిమాండ్ చేశారు. గ్రామంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గ్రామానికి చెందినఒక నాయకుడు అక్రమంగా భూమిని పట్టా చేయించుకుని ఉన్న భూమికంటే అదనంగా రైతుబంధు పొందుతున్నాడని ఆరోపించారు. అదేవిధంగా చెరువుశిఖం, పీర్ల చావిడి, ఖబరస్థాన్ సైతం ఆక్రమించుకుని పట్టా చేయించుకున్నాడని ఆరోపించారు. గ్రామంలో ఎల్ఐసీ ఆర్థిక చేయూతతో, గ్రామస్థుల విరాళాలతో నిర్మించిన బస్టాండ్‌ను కూలగొట్టారని ఆరోపించారు. పలువురి రైతుల వద్ద పాస్‌పుస్తకాలు చేయిస్తానని వేలాది రూపాయలు సైతం అక్రమాలకు పాల్పడ్డారని వీటన్నింటిపై విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బత్తుల నాగేశ్వరరావు, అత్యూరి వెంకన్న, చీమలదారి రాములు, బొల్లం అశోక్, పాల్గొన్నారు.

66నెలల్లో 13మంది కమిషనర్లు

- వైరాకు పూర్తిస్థాయి అధికారి లేక పాలన ఇక్కట్లు
- ఎక్కువ కాలం ఇన్‌చార్జ్‌లే..
- మునిసిపాలిటీ అభివృద్ధికి ఆటంకాలు


వైరా మునిసిపాలిటీ

వైరా, ఫిబ్రవరి 23: వైరా మునిసిపాలిటీ ఏముహూర్తానా ఏర్పడిందో కానీ తరచూ కమిషనర్లు మారుతున్నారు. కేవలం 66నెలల కాలంలో ఇప్పటివరకు 12మంది వైరా మునిసిపాలిటీలో కమిషనర్లుగా పనిచేశారు. ఇటీవల 13వ కమిషనర్‌గా సీహెచ్.వేణు బాధ్యతలు చేపట్టారు. ఈయన ఎంతకాలం ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తారోననే వ్యాఖ్యలు విన్పిస్తోన్నాయి. 2018 ఆగస్టులో వైరా మునిసిపాలిటీ ఏర్పడింది. తలలు లేని మొండెం లాగా ఇంతవరకు వైరా మునిసిపాలిటీకి కమిషనర్ పోస్టు లేదు. వివిధ శాఖలకు చెందిన అధికారులే కమిషనర్లుగా పనిచేస్తున్నారు. ఇక్కడ పనిచేసేవారు కూడా నిలకడగా లేకపోవడంతో మునిసిపాలిటీలోని పరిస్థితులన్నీ అధ్వానంగా తయారయ్యాయి. అనేక వివాదాలు, సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్న వైరా మునిసిపాలిటీ నిర్వహణను కొత్తగా వచ్చిన కమిషనర్ వేణు చక్కదిద్దుతారా అనేది వెయ్యి డాలర్ల ప్రశ్నగా ఉంది. ఈ సమస్యల సుడిగుండాన్ని ఆయన ఎలా ఎదురీది ఇక్కడి పాలనను ఏవిధంగా గాడిలో పెడతారో ఆయన సమర్థతకు సవాల్‌గా ఉంది.

ఈ మునిసిపాలిటీకి మొదట ఖమ్మం మునిసిపాలిటీలోని సూపరింటెండెంట్‌గా ఉన్న జాకీర్ హుస్సేన్ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. కేవలం ఆరునెలలు మాత్రమే పనిచేసిన ఆయన ఉద్యోగోన్నతిపై వరంగల్ వెళ్లారు. ఆతర్వాత అప్పటి తహసీల్దార్ జె.సంజీవ 2019 ఫిబ్రవరి 16నుంచి అదే సంవత్సరం మే 24వతేదీ వరకు ఇన్‌చార్జ్ కమిషనర్‌గా పనిచేశారు. ఆతర్వాత ఖమ్మం నగర కార్పొరేషన్‌కు చెందిన సీతారామచంద్రరావు మే 25న మూడో కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి ఆగస్టు 31వరకు పనిచేసి ఆయన ఉద్యోగ విరమణ చేశారు. ఆతర్వాత సెప్టెంబరు ఒకటి నుంచి అక్టోబరు 18వరకు మునిసిపాలిటీలోని ఇన్‌చార్జ్ ఏఈ హుస్సేన్ ఎలాంటి అధికారాలు లేకుండా ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహించారు. ఆతర్వాత 2019 అక్టోబరు 19న ఖమ్మం నగర కార్పొరేషన్‌కు చెందిన ఆర్.విజయానంద్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి 2020 మే 31వరకు పనిచేశారు. ఆయన స్థానంలో ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ డీఈ పి.శ్రీనివాసరావు జూన్ ఒకటిన బాధ్యతలు చేపట్టి సెప్టెంబరు 12న బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎంపీడీవో ఎన్.వెంకటపతిరాజు ఇన్‌చార్జ్ కమిషనర్‌గా నియమితులయ్యారు. తిరిగి ఆయన స్థానంలో 2021 ఫిబ్రవరిలో మణుగూరులో పనిచేస్తున్న రెగ్యులర్ కమిషనర్ ఎస్.వెంకటస్వామి వైరా కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. అయితే ఆయనపై ఆరోపణలు రావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు 2022 ఫిబ్రవరిలో సెలవుపై వెళ్లారు. తిరిగి ఆయన స్థానంలో రెండోసారి ఎంపీడీవోగా ఉన్న వెంకటపతి రాజు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయనకు పనిభారం ఇతర వత్తిళ్ల నేపథ్యంలో 2022 సెప్టెంబరు 30న స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం వైరా మునిసిపాలిటీ ఇన్‌చార్జ్ ఏఈగా ఉన్న బి.అనితను ఇన్‌చార్జ్ కమిషనర్‌గా నియమించారు. ఆమెపై అనేక అవినీతి, ఆరోపణలు వచ్చాయి. దాంతో ఆమెను ఇన్‌చార్జ్ కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించారు. గత ఏడాది ఏప్రిల్‌లో ఇన్‌చార్జ్ కమిషనర్‌గా పతాని వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టారు. అయితే ఆఏడాది నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో విధుల్లో అలసత్వం ప్రదర్శించారనే కారణంతో కలెక్టర్ ఆయనను సెలవుపై వెళ్లాలని ఆదేశించారు. ఆయన స్థానంలో ఎంపీడీవోగా ఉన్న డి.కరుణాకర్‌రెడ్డి గత ఏడాది నవంబరు 22న మునిసిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు ఎంపీడీవోల బదిలీలతో ఆయన ఇక్కడి నుంచి వెళ్లిపోయారు. వివాదాస్పద వెంకటస్వామిని మళ్లీ వైరా కమిషనర్‌గా తీసుకురావడానికి జరిగిన ప్రయత్నాలు వివాదాస్పదమ య్యాయి. ఖాళీగా ఉన్న స్థానంలో ఇప్పుడు 13వ కమిషనర్‌గా వేణు బాధ్యత లు చేపట్టారు. ఆయన ఎంతవరకు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తారో వేచిచూడాల్సి ఉంది.

ఖిల్లాపై కాషాయ జెండా ఎగరడం ఖాయం

- బీజేపీ రాష్ట్ర నాయకుడు వినోదరావు
- విజయసంకల్పయాత్రను విజయవంతం చేయాలని పిలుపు

తల్లాడ, ఫిబ్రవరి 23: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి ఖమ్మం ఖిల్లాపై కాషాయ జెండా ఎగురవేయడం ఖాయమని బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోదరావు అన్నారు. ఈనెల 25న ప్రారంభం కానున్న విజయ సంకల్పయాత్ర సన్నాహక సమావేశం శుక్రవారం తల్లాడలో మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వినోదరావు మాట్లాడుతూ దేశంలో మరోసారి మోడీ పాలనను కోరుకుంటున్నారని తెలిపారు. 26న విజయ సంకల్ప యాత్ర తల్లాడలో జరుగుతుందని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మోడీ పాలనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పార్లమెంటరీ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, జిల్లా నాయకులు డాక్టర్ జి.వెంకటేశ్వరరావు, వీరంరాజు, మున్నా మిశ్రా, చావా కిరణ్, గాదె కృష్ణారావు, రాయల రమేష్, చిట్టెం నర్సింహారావు, వాడవల్లి నాగేశ్వరరావు, చౌడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైరా: వైరాలో 26న నిర్వహించే బీజేపీ విజయ సంకల్పయాత్రను జయప్రదం చేయాలని బీజేపీ నాయకుడు శ్రీరంగరాజు రుక్మారావు పిలుపునిచ్చారు. భద్రాచలం నుంచి బయల్దేరి వైరా వస్తున్న విజయ సంకల్పయాత్రలో భాగంగా శుక్రవారం ఇక్కడ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. బీజేపీ వైరా నియోజకవర్గ కన్వీనర్ నెల్లూరి కోటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్ సభ్యుడు కొవ్వూరి నాగేశ్వరరావు, నాయకులు ఏలే భద్రయ్య, మనుబోలు వెంకటకృష్ణ, ఓర్సు శ్రీనివాస్, చింతనిప్పు రామారావు, పల్లపాటి వెంకటేష్, నల్లమోతు కోటిరెడ్డి పాల్గొన్నారు.

విజయసంకల్పయాత్ర పోస్టర్ విడుదల

పెనుబల్లి: బీజేపీ సీనియర్ నాయకుడు తాండ్ర వినోదరావు ఆధ్వర్యంలో శుక్రవారం పెనుబల్లిలో విజయ సంకల్పయాత్ర గోడప్రతులను ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు బొర్రా నర్సింహారావు, యాత్ర ఇన్‌చార్జ్ తిరుపతి రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, అసెంబ్లీ కన్వీనర్ భాస్కర్ల వీరంరాజు, జిల్లా కార్యదర్శి మున్నా మిశ్రా, మండల కార్యదర్శి ఓరుగంటి రాము, పేర్ల మహేష్, గోదా శ్రీనివాసరావు, రేగళ్ల వెంకటేశ్వర్లు, మల్లెల నాగేంద్రరావు పాల్గొన్నారు.

మోదీ మరోసారి ప్రధానమంత్రి కావడం ఖాయం

ఏన్కూరు: విజయసంకల్ప యాత్ర విజయవంతం చేయాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రంగరాజు రుక్మారావు కోరారు. 26న వైరాలో సంకల్పయాత్ర ఉంటుందన్నారు. వైరా అసెంబ్లీ కన్వీనర్ నెల్లూరు కోటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కొవ్వూరు నాగేశ్వరరావు, కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు నరుకుల్ల వెంకటేశ్వర్లు, మండల ఉపాధ్యక్షుడు మోరబోయిన కృష్ణ, దళితమోర్చ మండల అధ్యక్షుడు రెంటపల్లి నారాయణ, కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు బొల్లి వెంకటేశ్వర్లు, రాజేందర్, మల్ల అంజి, భద్రం, చింతలబోయిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆదివారం నిర్వహించే విజయ సంకల్పయాత్రలో కాకతీయ-భద్రకాళీ క్లస్టర్ రథయాత్రను విజయవంతం చేయాలని రథయాత్ర ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సత్తుపల్లిలోని బీజేపీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. 26న సత్తుపల్లి నియోజకవర్గం తల్లాడ మండలానికి చేరుకుంటుందని, బీజేపీ శ్రేణులు, అభిమానులు వేలాదిగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, నాయకులు తాండ్ర వినోద్‌రావు, భాస్కర్ల వీరంరాజు, చావా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


తల్లాడలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించాలి: జడ్పీ చైర్మన్

బోనకల్, ఫిబ్రవరి 23: విద్యార్థులు ఏకాగ్రతతో చదివి మంచి మార్కులు సాదించాలని జడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్ సూచించారు. మండలంలోని గోవిందాపురం(ఎల్) ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది పరీక్షలు సమీపిస్తున్నందున ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేసి మెరుగైన ఫలితాలు సాదించేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి చేయాలి: డీఈవో

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 23: పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేయాలని డీఈవో సోమశేఖరశర్మ సూచించారు. మండల పరిధిలోని కొండాపురం ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వారు పరీక్షలకు సన్నద్ధం అవుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్షల గురించి వివరించారు. అర్థం చేసుకుని చదివితే పరీక్షల్లో మంచి మార్కులు సాదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రాంతి జూనియర్ కళాశాల విద్యార్థులకు వీడ్కోలు


విజేతలతో కళాశాల యాజమాన్యం

వైరా, ఫిబ్రవరి 23: వైరాలోని ఠాగూర్ విద్యాసంస్థలైన క్రాంతి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు సభ నిర్వహించారు. విద్యార్థులకు నిర్వహించిన ఆటలపాటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి సునీత, కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్, డైరెక్టర్ సంయోగిత, టీఆర్ఎస్ఎంఏ ఉపాధ్యక్షుడు ఉమాశంకర్, ప్రిన్సిపాల్ లింగారావు, తాటిపల్లి సుధీర్, మజీద్, వేణు పాల్గొన్నారు.

కేంద్ర ఉపకారవేతనానికి 'హార్వెస్ట్' విద్యార్థి ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

ఖమ్మం ఖానాపురంహవేలి ఫిబ్రవరి 23: కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా నిర్వహించే తపాలాశాఖ ఉపకారవేతన పరీక్షకు ఖమ్మం నగరంలోని హార్వెస్ట్ పాఠశాల విద్యార్థిని బి శ్రీతనిష్క ఎంపికైందని విద్యా సంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి తెలిపారు. ప్రాజెక్ట్ పరీక్షలో స్టాంపులు సేకరించి వివరాలతో ప్రదర్శించి ఫిలాటలీ ఎగ్జామినేషన్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థిని యాజమాన్యం అభినందించింది.

మేడారంలో కొనసాగుతున్న ఆర్టీసీ వైద్యశిబిరం

ఖమ్మం ఖానాపురంహవేలి ఫిబ్రవరి 23: మేడారం మహా జాతరలో విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు మూడు బేస్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు ఖమ్మం ఆర్టీసీ ప్రాంతీయ వైద్యాధికారి డాక్టర్ ఏవీ గిరిసింహారావు తెలిపారు. రోజుకు 400 మంది వైద్య సేవలు పొందుతున్నారని, 4 గురు వైద్యులు, 15 మంది సిబ్బంది, 4 అంబులెన్స్‌లతో నిరంతరం 24 గంటలు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అత్యవసర కేసులను వరంగల్, హైదరాబాద్‌కు తరలిస్తున్ననట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 23: మండలంలోని పిండిప్రోలుకు చెందిన మీగడ మల్లయ్య (55) శుక్రవారం మృతిచెందాడు. కాగా వారి కుటుంబసభ్యులకు యాదవ సంఘం ఆధ్వర్యంలో దొడ్డ గురవయ్య, ఎస్.మల్సూర్, సొసైటీ డైరెక్టర్ చల్లా వెంకటేశ్వర్లు, యాదగిరి, మీగడ సైదులు, మీగడ సత్యం, జాలె నాగేశ్వరరావులు రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముదిగొండ, ఫిబ్రవరి 23: మండల పరిధిలోని లక్ష్మీపురం ఫీడర్‌లో కొత్త లైన్ల నిర్మాణం మరమ్మతుల కారణంగా చెట్ల తొలగింపు కార్యక్రమం వంటి కార్యక్రమాల వల్ల శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ రామారావు తెలిపారు. ఈ ఫీడర్‌లోని సువర్ణాపురం, ఖానాపురం, పండ్రేగుపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం: హెచ్‌ఎం

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 23: బాలికలు, మహిళలకు ఆత్మరక్షణకు కరాటే విద్య ఎంతో అవసరమని ఎన్టీఆర్ నగర్ జడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు వీర్ల సరోజిని అన్నారు. గతేడాది నవంబర్ నుంచి పాఠశాలలో విద్యార్థినీలకు ఇప్పిస్తున్న కరాటే శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థినీలకు బహుమతులను అందజేయగా శిక్షకురాలు నడ్డి శైలజ, కరాటే మాష్టర్ పిచ్చయ్యను ఉపాధ్యాయులు, తల్లీదండ్రులు అభినందించారు.

పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకోవద్దు: ఎస్ఐ


కొండల్‌రావు

తల్లాడ, ఫిబ్రవరి 23: ఆటోలు ఇతర వాహనదారులు పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ బి.కొండల్‌రావు హెచ్చరించారు. శుక్రవారం తల్లాడలో జరిగిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామర్థ్యానికి మించి కూలీలను ఆటోలు, వ్యాన్లలో తరలించడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణనష్టంతోపాటు అనేకమంది గాయాలపాలవుతున్నారని ఆయన పేర్కొన్నారు. వాహనదారులు అన్ని రకాల ధ్రువపత్రాలు దగ్గర ఉంచుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని కోరారు.

3నుంచి మాస్‌లైన్ మహాసభలు

కల్లూరు, ఫిబ్రవరి 23: ఖమ్మంలో వచ్చేనెల 3 నుంచి 5 వతేది వరకు జరగనున్న సీపీఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) ఆధ్వర్యంలో జరగనున్న మహాసభలను విజయంతం చేయాలని శుక్రవారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా నాయకుడు ఏ వెంకన్న మాట్లాడుతూ ఈ సభలకు ప్రజాస్వామ్య వాదులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎన్ మగన్న, హమాలి సంఘం నాయకులు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం

బోనకల్, ఫిబ్రవరి 23: స్థానిక ఖమ్మం బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రదాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విదానాలను అవలంబిస్తుందని ఆ పార్టీ నాయకులు ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం రైతుల పై నిర్వహించిన కాల్పుల వలన 23 ఏళ్ల శుభకరణ్ సింగ్ మృతి కలిచి వేసిందన్నారు. రైతులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరావు, తెల్లాకుల శ్రీనివాసరావు, బోయినపల్లి వీరబాబు, బండి శ్రీనివాసరావు, ఉప్పర శ్రీను, మచ్చా గురవయ్య, బిల్లా విశ్వనాదం, బంక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కల్లంలో ఆరబోసిన మిర్చి చోరీ

కామేపల్లి, ఫిబ్రవరి 23: కల్లంలో ఆరబోసిన మిరపకాయలను దొంగలు ఎత్తుకుపోయిన సంఘటన కామేపల్లి మండల ముచ్చర్ల గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలు.. ముచ్చర్ల గ్రామానికి చెందిన బుర్ర శ్రీను తన మిరిపకాయలను కల్లంలో ఆరబోసి పట్టాలు కప్పి వెళ్లాడు. గురువారం రాత్రి దొంగలు కల్లంలో ఉన్న మిరపకాయలలో క్వింటన్నర మిరిపకాయలను చోరీ చేశారన్నాడు. వాటి విలువ సుమారు రూ.30వేల వరకు ఉంటుందని వాపోయాడు.

జమలాపురం ఆలయాన్ని దర్శించిన అదనపు కలెక్టర్

ఎర్రుపాలెం, ఫిబ్రవరి 22: మండలంలో తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాన్ని అదనపు కలెక్టర్ మధుసూదన్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆలయ సాంప్రదాయాలతో అదనపు కలెక్టర్‌కు స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనంతోపాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు. తదనంతరం తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఓటు నమోదుకు వేగవంతం చేయాలన్నారు. ఓటరు అభ్యర్థన ఫారం 6, 8 లను పరిశీలించారు. ధరణిపోర్టల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్లను, టీఎం 33లో రైతుల దరఖాస్తులను పరిశీలించారు. రికార్డు రూమ్‌లో పొందుపరిచిన పాత పహాణీ రికార్డులను తనిఖీచేశారు. పహాణీలు భద్రపర్చటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మన్నె ఉషాశారద, ఎంపీడీవో బి.సురేందర్, ఎంపీవో శ్రీలక్ష్మీ, ఆర్ఐ రాజశేఖర్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు ఉంటే చెప్పండి: ఎమ్మెల్యే రాగమయి


మహిళలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 23: నియోజకవర్గంలో సమస్యలు ఉంటే తనకు నిరభ్యంతరంగా చెప్పాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి కోరారు. శుక్రవారం సత్తుపల్లి మండలంలోని రేజర్లతో పాటు పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలతో పాటు శంకుస్థాపనలు చేశారు. గ్రామాల అభివృద్ధికి తమవంతు సహకారంతో ఎప్పుడూ ఉంటుందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామాలలో సమస్యలను పరిశీలనలో ఉంచుకున్నామని, మౌలిక వసతుల కల్పనలో సమకూర్చుకుని సమిష్టిగా ఉండి అడ్డుపడకుండా ఉంటే అభివృద్ధిలో ముందు ఉంచుదామన్నారు. విరాట్‌నగర్, జవహర్ నగర్, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద, రాజీవ్‌నగర్‌లో పలు అభివృద్ధి పనులు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో కమిషనర్ మందా రవిబాబు, ఎంపీడీవో నాగేశ్వరరావు, స్పెషల్ ఆఫీసర్, ఏవో వై.శ్రీనివాసరావు, ఎంపీపీ దొడ్డా హైమావతి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్కసారలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే


మేడారంలో కుటుంబసభ్యులతో ఎమ్మెల్యే

వైరా, ఫిబ్రవరి 23: వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ కుటుంబ సమేతంగా శుక్రవారం మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతలను దర్శించుకున్నారు. అమ్మవారికి కుటుంబసభ్యులతో కలిసి పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు.

అభ్యంతరాలు ఉంటే ఓట్లను తొలగిస్తాం: ఆర్డీవో

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 23: వచ్చే ఎమ్మెల్సీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం సత్తుపల్లి తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి రాజకీయ పార్టీ నాయకులతో కల్లూరు ఆర్డీవో ఎస్.అశోకచక్రవర్తి సమావేశమయ్యారు. డబుల్ ఎంట్రీ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు చేర్పులు, మార్పులు జరిగాయని, ఇంకా ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఓట్లను తొలగించడం, చేరుస్తామని ఆయన సూచించారు. అదేవిధంగా బీఎల్‌వోలు పారదర్శకంగా పనిచేయాలని, సర్వే క్షేత్రస్థాయిలో పనిశీలించిన తర్వాతే నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ యోగీశ్వరరావు, గిర్దావర్లు నరేష్, జానీ మియా, రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కోడిపందెం స్థావరంపై పోలీసుల దాడి

కల్లూరు, ఫిబ్రవరి 23 మండల పరిధిలోని పెద్దకోరుకొండి గ్రామ శివారున శుక్రవారం కోడిపందెం స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని పెద్దకోరుకొండి గ్రామ శివారున కోడిపందెం ఆడుతున్నారని సమాచారం అందటంతో స్థానిక పోలీసులు దాడి చేశారు. ఈ సంఘటనలో కుర్నవల్లి గ్రామానికి చెందిన పానుగంటి వీరభద్రం, నల్లబోతుల గోపికృష్ణ, ఎస్‌కే ఖాదర్, బి నాగయ్య, జి శ్రీనివాసరెడ్డిలను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1470 నగదు, మూడు కోళ్లు, రెండు కత్తులు, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్‌కే షాకీర్ తెలిపారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

వైరా, ఫిబ్రవరి 23: మండలంలోని గరికపాడు గ్రామంలో రూ.పదిలక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు ఎంఈవో, గ్రామ ప్రత్యేక అధికారి కొత్తపల్లి వెంకటేశ్వర్లు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ చొరవతో నిధులు మంజూరయ్యాయని గరికపాడు సొసైటీ మాజీ అధ్యక్షుడు శీలం సురేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తేళ్లపుట్ట రాధాకృష్ణ, నాయకులు గడిపూడి రామకృష్ణ, అయిలూరి కృష్ణారెడ్డి, రేమల్లె గాంధీ పాల్గొన్నారు.

ఆళ్లపాడులో..

బోనకల్, ఫిబ్రవరి 23: మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో శుక్రవారం ఈజీఎస్ పథకం కింద మంజూరైన రూ.16లక్షల నిధులతో వేయనున్న సీసీ రోడ్ల పనులను తహసీల్దార్ పున్నం చందర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు పనులను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పారా శ్రీదేవి, కాంగ్రెస్ నాయకులు పారా వెంకటమోహన్‌రావు, కందుల పాపారావు, బుంగా రాములు, కందుల సత్యం, మరీదు ప్రసాద్, వెంకట్రావు, వెంకన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పొద్దుటూరు గ్రామాభివృద్ధికి కృషి

చింతకాని, ఫిబ్రవరి 23: పొద్దుటూరు గ్రామాభివృద్ధికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కట్టుబడి ఉన్నాడని ఎంపీపీ పూర్ణయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పొద్దుటూరు గ్రామంలో ఉపాధిహామీ నిధులు రూ 25 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, నాయకులు కూరపాటి కిషోర్, కొప్పుల గోవిందరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

వైరా, ఫిబ్రవరి 23: రాష్ట్ర ఉపాధి శిక్షణా ఆధ్వర్యంలో ప్రొడెక్టవిటీ కౌన్సిల్ ఉపాధి అవకాశాలపై నిరుద్యోగ యువతకు శుక్రవారం వైరాలో శిక్షణనిచ్చారు. శిక్షణ పొందిన యువతకు సర్టిఫికెట్లు జారీ చేశారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్, కోఆర్డినేటర్ సత్యం పాల్గొన్నారు.

గ్యాస్‌ల పంపిణీ

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 23: మండలంలోని జింకలగూడెం, గోల్‌తండా, జోగులపాడుగ్రామాలకు చెందిన 150మంది లబ్ధిదారులకు శుక్రవారం గ్యాస్‌లను జడ్పీటీసీ బెల్లం శ్రీను పంపిణీ చేశారు. ఇండియన్ గ్యాస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఉజ్వల గ్యాస్ పథకం కింద అందించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లింగన్న, బానోతు రమేష్, సుదర్శన్, ఎస్‌క నజీర్, కరీం, పాల్గొన్నారు.

కన్నుల పండువగా మినీ మేడారం జాతర

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 23: మండలంలోని కాకరవాయి గ్రామంలో శుక్రవారం మినీ మేడారం జాతర కన్నుల పండువగా నిర్వహించారు. సమ్మక్క, సారలమ్మ ఆలయ నిర్వాహకురాలు కొత్తపల్లి సరిత, మల్సూర్ దంపతులు ఘనంగా ఈకార్యక్రమం నిర్వహించారు. జాతరకు వివిధ ప్రాంతాలనుంచి భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

కార్యకర్తలకు అండగా పార్టీ

- మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య


పెనుబల్లి, ఫిబ్రవరి 23: బీఆర్ఎస్ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి బీమా సౌకర్యం కల్పించి వారి కుటుంబసభ్యులకు పార్టీ భరోసా ఇస్తుందని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. మండలంలోని కొత్తకారాయిగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కొమ్మెరబోయిన పూర్ణచంద్రరావు ప్రమాదవశాత్తూ కరెంట్‌షాక్‌తో మృతిచెందాడు. ఇతని కుటుంబసభ్యులను పరామర్శించి అతని భార్య నందినికి రూ.2లక్షల ప్రమాదబీమా చెక్కును వెంకటవీరయ్య అందజేశారు. అలాగే మండలంలో పలు బాదిత కుటుంబాలను పరామర్శించారు. పెనుబల్లిలో ఓ విలేకరి షేక్.బాజీ కుమారుడు, కుమార్తె వస్త్రాలంకరణ జరుగగా వారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కనగాల వెంకట్రావ్, చెక్కిలాల లక్ష్మణ్‌రావు, పసుమర్తి వెంకటేశ్వరరావు, లగడపాటి శ్రీను, గోదా చెన్నారావు, రావూరి రత్నకుమారి, నాగల కోటేశ్వరరావు, చింతనిప్పు నర్సింహారావు, దొడ్డపనేని శ్రీదేవి, పోతురాజు వెంకటకృష్ణారావు, తావూనాయక్ పాల్గొన్నారు.


బీమా చెక్కు అందజేస్తున్న సండ్ర

ఎమ్మెల్యే లాస్య నందిత మృతికి సంతాపం

సత్తుపల్లి: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతికి సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆమె కుటుంబానికి సండ్ర సంతాపం ప్రకటించారు. లాస్య నందిత తండ్రి సాయన్నతో తనకు ఉన్న అనుబంధం ఎనలేదని, వారి ఇరువురి మరణం పార్టీకి తీరని లోటని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని సండ్ర ఆకాంక్షించారు.

బుగ్గవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న సింగరేణి అధికారులు


కారేపల్లి, ఫిబ్రవరి 23: మండల పరిధిలోని పోలంపల్లి గ్రామ సమీపంలో బుగ్గవాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు శుక్రవారం సింగరేణి సంస్థ అధికారులు స్థల పరిశీలన నిర్వహించారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఆదేశాల మేరకు శివరాత్రి పండగ పురస్కరించుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులకు కలగకుండా బుగ్గవాగుపై ఐరన్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే ఇల్లందు సింగరేణి సస్థ జీఎం, కారేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు తదితరులు స్థల పరిశీలన చేశారు. మోకాళ్ల రామయ్య గుంపు నుండి, కోటిలింగాల వద్దకు అవసరమైన సీసీ రోడ్డు ఏర్పాటు కూడా అధికారులు పరిశీలించారు.

ఎంపీడీవో కార్యాలయం తనిఖీ

కామేపల్లి, ఫిబ్రవరి 23: కామేపల్లి ఎంపీడీఓ కార్యాలయాన్ని జడ్పీ సీఈవో వినోద్ ఆకస్మికంగా శుక్రవారం తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీల్లో సమస్యల గురించి ఈడిగి తెలుసుకున్నారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యలను త్వరగా పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ తనిఖీలో ఎంపీవో రవీందర్, సీనియర్ అసిస్టెంట్ సాంబశివరావు, జూనియర్ అసిస్టెంట్ రాజు పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించాలి

- కూసుమంచి ఏడీఈ కోక్యానాయక్
- సిబ్బందితో సమీక్షా సమావేశం


మాట్లాడుతున్న ఏడీఈ కోక్యానాయక్

కూసుమంచి, ఫిబ్రవరి 23: రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలని సూచించిందని, అందుకనుగుణంగా క్షేత్రస్థాయిలో అధికారులు చర్యలు తీసుకోవాలని కూసుమంచి ఏడీఈ కోక్యానాయక్ తెలిపారు. శుక్రవారం కూసుమంచి సబ్‌డివిజన్ పరిధిలోని నేలకొండపల్లి, రాజేశ్వరపురం, కూసుమంచి, బచ్చోడు, పాలేరు సబ్‌స్టేషన్ ఏఈలు, విద్యుత్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. త్వరలో వేసవి సమీపిస్తున్న సందర్భంగా విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, వ్యవసాయానికి, గృహ అవసరాలకు, తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు పటిష్టమైన ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. లైన్లను ట్రాన్స్‌ఫార్మర్లను తరచూ పరిశీలించడం ద్వారా అంతరాయం కలగకుండా చూడాలని తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులకు ఒకసమయం కేటాయించి ఎల్‌సీ తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.